వాయిస్ అఫ్ ప్రజలు

వాయిస్ టుడే

TGTEL/25/A2649

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

శనివారం, నవంబరు 29, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

హాంకాంగ్ ప్రమాదంలో 128కి చేరిన మృతుల సంఖ్య

హాంకాంగ్: హాంకాంగ్‌లోని వాంగ్ ఫుక్ కోర్ట్ ఎస్టేట్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య 128కి చేరింది. ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్స్ పునరుద్ధరణ పనులు చేపట్టిన పిస్ట్రీజ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లు, ఒక ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



కేసీఆర్ దీక్ష నాటకం మాత్రమే: మహేశ్‌కుమార్‌గౌడ్

దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ కొత్త ప్రదర్శన

నిమ్స్‌లో ఫ్లూయిడ్స్ తీసుకున్నారని టీపీసీసీ ఆరోపణ

తెలంగాణ సోనియా గాంధీ చలవతోనే సాధ్యం అయిందన్న వ్యాఖ్య

స్థానిక ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గల్లంతే అని భవిష్యవాణి

కోమటిరెడ్డిపై కైలాష్ వ్యాఖ్యలు పాతవని స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 28: బీఆర్ఎస్ ఉనికి వేగంగా క్షీణిస్తున్న నేపథ్యంలో 'దీక్షా దివస్' పేరుతో ఆ పార్టీ కొత్త రాజకీయ నాటకానికి తెరలేపిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 2009లో కేసీఆర్ చేపట్టిన దీక్ష నిజమైనదేమీ కాదని, అది పూర్తిగా రాజకీయ ప్రదర్శనేనని ఆయన వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్‌గౌడ్, తెలంగాణ సాధన కేసీఆర్ దీక్ష ఫలితం కాకుండా సోనియాగాంధీ సంకల్పంతో వచ్చిందని స్పష్టం చేశారు. రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నట్లు ప్రకటించిన కేసీఆర్, వాస్తవానికి నిమ్స్ ఆసుపత్రిలో

(మిగతా 2వ పేజీలో)

విజన్-2047లో ఆరోగ్యం ప్రధాన అజెండా

పీహెచ్‌సీల్లో డాక్టర్ల నియామకాన్ని దశలవారీగా పెంచే లక్ష్యం

వృద్ధుల కోసం 'హెల్తీ ఏజింగ్ మిషన్' ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

ప్రైవేటు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు చర్యలు

రేపు సీఎంపై సమీక్షకు హెల్త్ ఫస్ట్ డాక్యుమెంట్ సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 28: రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పునాదులేస్తూ 'హెల్త్ ఫస్ట్' అనే దీర్ఘకాలిక ఆరోగ్య వ్యూహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందిస్తోంది. ప్రజల ఆరోగ్యం మెరుగుపడితేనే ఆర్థిక, సామాజిక ఉత్పాదకత పెరుగుతుందనే భావంతో సిద్ధం చేసిన ఈ వ్యూహంలో 2047 నాటికి తెలంగాణను మానవ అభివృద్ధి సూచిక (%ఎణ×%)లో అగ్రస్థానానికి తీసుకెళ్లే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్థు నేతృత్వంలో కమిటీ రూపొందించిన నివేదికను ఆదివారం సీఎం సమీక్షించనున్నారు. ఈ సమావేశానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలు ఉన్నతాధికారులు హాజరవుతారు.

2047 నాటికి గ్రామీణ పీహెచ్‌సీల్లో డాక్టర్ల పూర్తిస్థాయి నియామకం

ప్రస్తుతం పీహెచ్‌సీల్లో వైద్యుల లభ్యత 42.8% మాత్రమే ఉండగా, 5 సంవత్సరాల్లో 60%కు, 2047 నాటికి 100%కు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి 10,000 మంది జనాభాకు ఉండే డాక్టర్లు%-%నర్సుల సంఖ్యను ప్రస్తుత 10 నుంచి 44కి పెంచే ప్రణాళికను కూడా నివేదికలో చేర్చారు. ఆరోగ్య రంగంపై ప్రభుత్వ పెట్టుబడిని పెంచే దిశగా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం

(మిగతా 2వ పేజీలో)

పంచాయతీ ఎన్నికల్లో జోక్యం సరైంది కాదు: తెలంగాణ హైకోర్టు

జీవో 46 నిలిపివేతకు ధర్మాసనం నిరాకరణ

50% రిజర్వేషన్ పరిమితి రాజ్యాంగబద్ధమే అని స్పష్టం

ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత జోక్యం చేయలేమని అభిప్రాయం

ప్రతివాదులకు కౌంటర్ దాఖలు చేయాలన్న కోర్టు ఆదేశం

తదుపరి విచారణకు 8 వారాల వాయిదా

హైదరాబాద్, నవంబర్ 28: రాష్ట్రంలో పంచాయతీ రాజ్ ఎన్నికల నిర్వహణ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను 50% లోపే ఉంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై స్టే ఇవ్వాలని చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. రాజ్యాంగపరమైన నిబంధనల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను ఎన్నికల కాలంలో అడ్డుకోవడం సరికాదని సుప్రీంకోర్టు పదేపదే చెప్పిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. పిటిషనర్ల వాదనలు విన్న తరువాత, ప్రతివాదులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసును 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 285(ఏ) ప్రకారం స్థానిక సంస్థల్లో

(మిగతా 2వ పేజీలో)

తెలంగాణ రైల్వే మౌలిక వసతులకు బూస్ట్

::: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల నూతనీకరణ

హైటెక్ సిటీ స్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రతి రోజు 5,400 ప్రయాణికులకు సేవల విస్తరణ

సంక్రాంతికి 16 ప్రత్యేక రైళ్ల నిలుపు నిర్ణయం

కొమురవెల్లి స్టేషన్ నిర్మాణం పూర్తికి చేరువ

కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి రాజీనామా

పీజీ మెడికల్ మూల్యాంకనంలో అవకతవకల ఆరోపణలతో వివాదం

విజిలెన్స్ ప్రాథమిక నివేదికలో వీసీ ప్రమేయం గుర్తింపు

పాలనా వైఫల్యంపై సీఎం రేవంత్ తీవ్ర అసంతృప్తి

అధికారుల వివరణతో అసంతృప్తిరాజీనామాకు సూచన

ప్రతిష్టను కాపాడేందుకు రాజీనామాననే వీసీ వివరణ

పూర్తి విచారణతో నిజాలు బయటపడతాయని నందకుమార్ వ్యాఖ్య

హైదరాబాద్, నవంబర్ 28: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామా పత్రాన్ని వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపారు. ఇటీవల పీజీ మెడికల్

(మిగతా 2వ పేజీలో)

గ్లోబల్ సదస్సుకు భారీ ఏర్పాట్లు

డిసెంబర్ 8-9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

3 వేల మంది జాతీయ-అంతర్జాతీయ ప్రముఖులకు ఆహ్వానాలు

రాష్ట్ర చరిత్రలోనే ప్రతిష్టాత్మక వేదికగా తీర్చిదిద్దే ప్రణాళిక

సీఎం రేవంత్ స్వయంగా ప్రముఖులను ఆహ్వానిస్తున్న వేడుక

టోనీ బ్లెయిర్ నుండి మహీంద్రా వరకూ విశిష్ట అతిథుల రాక

సదస్సు ముగింపులో మెస్సీ ప్రత్యేక మ్యాచ్ ఆకర్షణ

కాంగ్రెస్-బీజేపీ మోసపూరిత రాజకీయాలపై హరీశ్ రావు విమర్శలు

రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే 2 జాతీయ పార్టీలకూ బీఆర్ఎస్ నేత ధాటిగా విమర్శ

పల్లె స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపు

కేంద్రం నుంచి తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపణ

వరి-గోధుమ ఎంఎస్‌పీ వ్యత్యాసం రైతులకు నష్టమని వ్యాఖ్య

పాఠశాల పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వ వైఫల్యం

మేం లొంగిపోతాం!

అనంత్ దళం లొంగుబాటు సంకేతం

మూడు రాష్ట్రాలకు లేఖ పంపిన ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్

కాల్పుల విరమణకై ప్రభుత్వాల సహకారం కోరిన మావోయిస్టులు

అధికారిక ప్రకటన వెలువడిన మరుసటి రోజే అనంత్ టీమ్ ఆత్మసమర్పణ

ప్రధాన స్రవంతిలోకి రావాలని నిర్ణయం

హైదరాబాద్/భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 29: మావోయిస్టు ఎంఎంసీ (మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ కీలక నేత అనంత్ తన దళంతో కలిసి అరణ్యాన్ని విడిచి లోకజీవనంలోకి చేరేందుకు సిద్ధమని ప్రకటించాడు. జనవరి 1న ఆయుధాలు పెట్టి లొంగిపోతామని గురువారం రాత్రి విడుదల చేసిన రెండు పేజీల లేఖలో అనంత్

(మిగతా 2వ పేజీలో)

మోదీ చేతుల మీదుగా 77 అడుగుల శ్రీరామ విగ్రహ ఆవిష్కరణ

గోవా కనకోనలో పార్టగాలి జీవోత్తం మఠం 550 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమం

సాధు-సంతులతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి

సంస్కృతి-సంస్కారాలతో మమేకం చేసే వేదికగా వేడుకల నిర్వహణ

పనాజీ, నవంబర్ 28: దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తయిన కంచు శ్రీరామ విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా

(మిగతా 2వ పేజీలో)

గ్లోబల్ సదస్సుకు భారీ ఏర్పాట్లు

డిసెంబర్ 8-9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

3 వేల మంది జాతీయ-అంతర్జాతీయ ప్రముఖులకు ఆహ్వానాలు

రాష్ట్ర చరిత్రలోనే ప్రతిష్టాత్మక వేదికగా తీర్చిదిద్దే ప్రణాళిక

సీఎం రేవంత్ స్వయంగా ప్రముఖులను ఆహ్వానిస్తున్న వేడుక

టోనీ బ్లెయిర్ నుండి మహీంద్రా వరకూ విశిష్ట అతిథుల రాక

సదస్సు ముగింపులో మెస్సీ ప్రత్యేక మ్యాచ్ ఆకర్షణ

హైదరాబాద్, నవంబర్ 28: డిసెంబర్ 8, 9 తేదీల్లో జరుగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్%-%2025ను ప్రభుత్వం అప్రతిహతంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన పారిశ్రామికవేత్తలు, టెక్నాలజీ దిగ్గజాలు, వ్యాపార నాయకులు, స్టార్టప్ వ్యవస్థాపకులు వంటి సుమారు 3 వేల మంది ప్రముఖులను ఆహ్వానించేలా ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర చరిత్రలో ఇంత విస్తారంగా, అంతర్జాతీయ ప్రాధాన్యతతో సదస్సు నిర్వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో, తెలంగాణ అభివృద్ధి దిశను ప్రపంచ వేదికపై ప్రదర్శించే సంకల్పంతో ఈ సదస్సుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నారు.

టోనీ బ్లెయిర్ - యూఏఈ రాయల్ ఫ్యామిలీ - గ్లోబల్ సీఈఓల హాజరు

సదస్సుకు ఇప్పటికే పలువురు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు హాజరవడానికి అంగీకరించారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యూఏఈ రాయల్ ఫ్యామిలీ సభ్యులు ప్రధాన అతిథులుగా రానున్నారు. అలాగే, డ్యూచ్ సె గ్రూప్ హెడ్ లుడ్విగ్ హెయిన్జెల్మాన్, ఎన్రిషన్ సంస్థ వ్యవస్థాపకుడు డబ్ల్యూ విన్‌స్టన్, మాండల్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ జెనెట్ నియో తదితరులు కూడా పాల్గొననున్నారు. సీఎం రేవంత్ స్వయంగా పలు రంగాల ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు పంపుతూ సదస్సు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు.

తప్పకుండా రండి.. ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం

'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 రోడ్‌మ్యాప్‌ను ప్రపంచ వేదికపై పరిచయం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. విభిన్న దేశాల ప్రతినిధులకు పంపిన ప్రభుత్వ ఆహ్వానంలో "ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల సమగ్ర అభివృద్ధికి తెలంగాణ కొత్త దిశను రూపొందించింది. ఈ ప్రయాణానికి మీరు సహయాత్రికులుగా తప్పకుండా రండి" అని పేర్కొన్నారు. పలుదేశాల నుంచి అనుకూల ప్రతిస్పందనలు ఇప్పటికే స్వీకరించామని సీఎంఓ వెల్లడించింది.

సదస్సు ముగింపులో మెస్సీ పర్యటనుప్రధాన ఆకర్షణ

రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ అనంతరం, డిసెంబర్ 13న ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లయోనెల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాటు చేయనుండగా, ఇది గ్లోబల్ సమ్మిట్‌కు ముగింపు ఘట్టంగా నిలిచేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

తెలంగాణ రైల్వే మౌలిక వసతులకు బూస్ట్

హైదరాబాద్, నవంబర్ 28: తెలంగాణలో రైల్వే అభివృద్ధి గత కొన్నేళ్లుగా వేగమందిందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే లైన్ల విస్తరణతో పాటు స్టేషన్ల ఆధునికీకరణపై కేంద్రం ముఖ్యంగా దృష్టిసారించిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ కొనసాగుతోందని వెల్లడించారు. శుక్రవారం హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ స్టేషన్ ద్వారా రోజుకు 62 సబర్బన్ మరియు ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయని, హైదరాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్, బోరబండ, ఫలక్‌నుమా వంటి స్టేషన్లతో మంచి కనెక్టివిటీ ఉందని వివరించారు.అభివృద్ధి పనులు పూర్తయ్యాక ప్రయాణికులకు మరింత సౌకర్యం, మరింత కనెక్టివిటీ లభిస్తుందని చెప్పారు. స్టేషన్ ద్వారా రోజుకు 5,400 మంది ప్రయాణికులు సేవలు పొందుతున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం 16 ప్రత్యేక రైళ్లు హైటెక్ సిటీలో నిలవనున్నాయి అని వెల్లడించారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం పూర్తికి దగ్గరలో ఉందని, భక్తుల ప్రయాణ సౌలభ్యం కోసం త్వంలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను యాదాద్రి వరకు విస్తరించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. కాజీపేటలో జరుగుతున్న రైల్వే మల్టీ-మ్యానుఫాక్చరింగ్ యూనిట్ పనులను శనివారం పరిశీలించనున్నట్టు తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

డిసెంబర్ 4-5 తేదీల్లో

భారత్ రానున్న పుతిన్

న్యూఢిల్లీ, నవంబర్ 29: భారత్-రష్యా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయనున్న కీలక పరిణామంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల 4, 5 తేదీల్లో న్యూఢిల్లీ పర్యటించనున్నారు. భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు జరపబోతున్నారని విదేశాంగ శాఖ శుక్రవారం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పుతిన్ పర్యటనకు అంతర్జాతీయంగా కూడా విశేష దృష్టి చేరింది. ఇరుదేశాల వ్యూహాత్మక సహకారానికి ఈ సమావేశం కొత్త దిశనిచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, హైటెక్ రంగం, ఇంధనం, రక్షణ సహకారం వంటి విభాగాల్లో కొత్త నిర్ణయాలు వెలువడే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. సమావేశం అనంతరం జాయింట్ స్టేట్‌మెంట్ విడుదల చేయడానికి ఇరు దేశాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొన్ని రంగాల్లో సరికొత్త ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు. రూపీ-రూబల్ లావాదేవీలను విస్తరించడం, ఇంధన దిగుమతులపై సౌకర్యాలు కల్పించడం, పౌర అణుశక్తి విభాగంలో భాగస్వామ్యాన్ని గాఢం చేయడం వంటి అంశాలు చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. గత కొన్నిమాసాలుగా తగ్గిన రష్యా చమురు దిగుమతులపై కూడా ఇరు దేశాలు అవగాహనకు రావచ్చని భావిస్తున్నారు. రష్యా నుంచి ముడి చమురుపై మరిన్ని డిస్కౌంట్లు ప్రకటించే అవకాశం ఉందనే ఊహాగానాలు దౌత్య వర్గాల్లో వినిపిస్తున్నాయి. రష్యా తన చమురు ఎగుమతులను పెంచాలని భావించడం, భారత్ భారీ మార్కెట్ అవడం ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తోంది. రక్షణ రంగంలో భాగంగా ఉపరితలం నుండి గాల్లోకి ప్రయోగించే ఎస్-400 క్షిపణి వ్యవస్థల అదనపు కొనుగోలు అంశం కూడా మోదీ-పుతిన్ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి. రష్యా నుంచి అత్యాధునిక ఆయుధాల కొనుగోలుపై భారత్ మళ్లీ దృష్టి పెట్టినట్లు సమాచారం.

రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక విందు

పుతిన్ పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన గౌరవార్థం విందు ఏర్పాటు చేయనున్నారు. ఇరుదేశాల పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై నేతలు లోతైన చర్చలు జరపనున్నట్లు దౌత్య వర్గాలు చెబుతున్నాయి. 2014 తర్వాత భారత్-అమెరికా సంబంధాల్లో బలహీనతలు కనిపిస్తున్న తరుణంలో పుతిన్ పర్యటన జరగడం ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. ఇరుదేశాల అనుబంధంలో కొత్త శక్తి, కొత్త దిశ లభించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మేం లొంగిపోతాం!

వెల్లడించాడు. తాజా ప్రకటన మూడు రాష్ట్రాల ప్రభుత్వాలకూ పెద్దస్పందన రాబట్టగా, లేఖ బయటకు వచ్చిన మరుసటి రోజే అనంత్ టీమ్ మహారాష్ట్రలో లొంగిపోవడం ప్రత్యేకంగా నిలిచింది. జనవరి 1 వరకు ఎక్కడా ఎన్‌కౌంటర్లు, అరెస్టులు జరగకూడదని, సహచరులతో సంప్రదింపులు సాగించే సమయం ఇవ్వాలని అనంత్ తన లేఖలో పేర్కొన్నాడు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), విష్ణుదేవ్ సాయ్ (ఛత్తీస్‌గఢ్), మోహన్ యాదవ్ (ఎంపీ)కు ఉద్దేశించి రాసిన ఈ లేఖలో "శాంతియుత లొంగుబాటుకు అనుకూల వాతావరణం అవసరం" అని స్పష్టం చేశాడు. జోన్‌లో విడిపోయి ఉన్న మావోయిస్టులు పరస్పరంగా మాట్లాడుకునేందుకు ప్రత్యేక రేడియో ఫ్రీక్వెన్సీని కూడా ప్రకటించాడు.

మహారాష్ట్రలో మొదటి అడుగు

అనంత్‌తో పాటు 11 మంది లొంగుబాటు

శుక్రవారం ఉదయం ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన అనంత్‌తో పాటు మరో 11 మంది అడవిని విడిచి మైదానం వైపు నడక మొదలుపెట్టారు. ముందుగా ఒక స్థానిక జర్నలిస్ట్ ద్వారా మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడి లొంగుబాటు ప్రక్రియకు హామీ పొందిన అనంతరం వారు గోండియా పోలీసుల ముందు ఆత్మసమర్పణ చేశారు. నిర్బంధం పెరగడం, భారీ ఆపరేషన్లు ఎదురవడం వల్లే తాము అరణ్య జీవితం ముగించాల్సి వచ్చిందని అనంత్ పేర్కొన్నాడు. హిడ్మా తరువాత ఎదిగిన మరో కీలక నేత రణదీర్ ఇంకా అడవిలోనే ఉన్నాడని, అతడూ సాధారణ జీవితం వైపు అడుగు వేయాలని అభిలషించాడు. ఎంఎంసీకి ఇన్‌చార్జి అయిన అనంత్ అసలు గుర్తింపు విషయమై చర్చలు నడుస్తున్నాయి. అతడు కరీంనగర్ జిల్లాకు చెందిన బత్తుల కాశీరామ్ అనే వ్యక్తి కావొచ్చన్న వార్తలు వెలుగులోకి వస్తున్నాయి.

కాంగ్రెస్-బీజేపీ మోసపూరిత రాజకీయాలపై హరీశ్ విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 28: రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ మరియు బీజేపీలు ఒకే తరహా మాయాజాలంతో ప్రజలను మోసగిస్తున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో పరస్పరం దుమ్మెత్తిపోసుకుంటూ కనిపించే ఈ రెండు పార్టీలు, రాష్ట్రంలో మాత్రం పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి సమన్వయంతో పలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో హరీశ్ రావు వారికి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు సముచిత నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి దెబ్బతిందని పేర్కొన్నారు. వరి ధాన్యానికి ఉత్తర భారత రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ మద్దతు ధర ఇవ్వడం రైతులకు తీవ్రమైన అన్యాయం చేశారని అన్నారు. గోదావరి పుష్కర ప్రాజెక్టు పేరుతో పొరుగు రాష్ట్రానికి భారీ నిధులు కేటాయిస్తూ, ఎనిమిది ఎంపీలను గెలిపించిన తెలంగాణకు మాత్రం కేంద్రం ఎలాంటి ప్రయోజనం కల్పించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లే కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ కార్యకర్తలు వాస్తవాలు గుర్తుచేస్తూ నిలదీయాలని హరీశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లేమి ఆందోళన కలిగిస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు. కల్తీ ఆహారం పెట్టిన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామనే ప్రభుత్వ ప్రకటనల కంటే ముందు, పిల్లలకు పురుగుల కల్తీ లేని భోజనం అందించడం ముఖ్యమని హరీశ్ అభిప్రాయపడ్డారు.

విజన్-2047లో ఆరోగ్యం ప్రధాన అజెండా

జీఎస్‌డీపీకి వైద్య రంగ సహకారం 1% ఉండగా, దీన్ని 5%కు పెంచేందుకు వ్యూహం సిద్ధమైంది. ప్రజలు వైద్యానికి వెచ్చించే మొత్తం ఖర్చులో 37% ప్రైవేటు రంగానికి వెళ్తుండగా, దీనిని 2047 నాటికి 6%కి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించి అత్యాధునిక వైద్య సేవలను మరింత అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. పిల్లలు, యువత, మహిళల్లో రక్తహీనత-పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రస్తుతం కొనసాగిస్తున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయనున్నారు. 2036 నాటికి రాష్ట్రంలో వృద్ధ జనాభా 17% దాటే అవకాశం ఉన్నందున, వారికి ప్రత్యేక సహాయ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. సిల్వర్ సిటీ జోన్స్, యాక్టివ్ ఏజింగ్ హబ్స్, మెంటార్‌షిప్, సెకండ్ లైఫ్ కెరీర్స్ లాంటి పథకాల ద్వారా వృద్ధులకు గౌరవప్రదమైన జీవితాన్ని సాకారం చేసే విధానాన్ని రూపొందిస్తున్నారు.అదేవిధంగా అంటువ్యాధుల నియంత్రణ, ఆరోగ్య పర్యవేక్షణ కోసం డిజిటల్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించనున్నారు.

కేసీఆర్ దీక్ష నాటకం మాత్రమే: మహేశ్‌కుమార్‌గౌడ్

ఫ్లూయిడ్స్ తీసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. "నిజమైన దీక్ష అంటే ఇరోమ్ షర్మిల నిర్వహించినది" అని ఉదాహరించారు.రాష్ట్ర ప్రజలు ఇప్పుడు కేసీఆర్‌ను ఎగతాళి చేసే స్థితిలో ఉన్నారని, బీఆర్ఎస్ శకం పూర్తిగా ముగియిందని మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఉస్మానియా వర్సిటీ విద్యార్థులే తెలంగాణ ఉద్యమానికి హృదయం అని గుర్తు చేసి, అమరులకు తొలుత నివాళులర్పించే నిజాయితీ బీఆర్ఎస్ నేతల్లో లేదని విమర్శించారు. లోక్‌సభ, కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి ఎదుర్కొన్నట్లు, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా ఆ పార్టీ పూర్తిగా కనిపించకుండా పోతుందని ఆయన అంచనా వేశారు. బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఈ అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను బీసీ వర్గాలు ప్రశ్నించాలన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై డీసీసీ అధ్యక్షుడు కైలాష్ చేసిన వ్యాఖ్యల వీడియో మూడు సంవత్సరాల కిందటిదే అని, దానిపై అప్పుడే ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పారని మహేశ్‌గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్స్ సెల్‌లో పదవులను ఆయన పంపిణీ చేశారు. కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేసీఆర్ నియంతృత్వ శైలిలో పెరిగిన కేటీఆర్ 'అభినవ గోబెల్స్'గా తయారయ్యారని విమర్శించారు. పారదర్శకంగా జరుగుతున్న పారిశ్రామిక భూబదలాయింపులపై కేటీఆర్, హరీశ్‌రావు నిరాధార ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

పంచాయతీ ఎన్నికల్లో జోక్యం సరైంది కాదు: తెలంగాణ హైకోర్టు

రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని కోర్టు పునరుద్ఘాటించింది. ఈ నెల 22న జారీ చేసిన జీవో 46ను తెలంగాణ గంగపుత్ర సంఘం, మడివాల మాచదేవ రజకుల సంఘం తదితరులు సవాలు చేశారు. పిటిషనర్లు తరఫు న్యాయవాది వాదిస్తూ, పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 9(4) ప్రకారం బీసీ%-%ఏ, బీ, సీ, డీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలన్న నిబంధనను ప్రభుత్వం పాటించలేదని పేర్కొన్నారు. బీసీలపై అధ్యయనం చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదికను కోర్టుకు సమర్పించాలని కోరారు. ప్రభుత్వ తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డి వాదిస్తూ, పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వెలువడిందని, నామినేషన్ల స్వీకరణ జరుగుతోందని, ఇలాంటి సమయంలో కోర్టు జోక్యం చేసుకోవడం ఎన్నికల ప్రక్రియను ఆపే ప్రమాదం ఉందని చెప్పారు. దీనిపై ధర్మాసనం కూడా అనుకూలంగా స్పందిస్తూ, ఎన్నికలు ప్రారంభమైన తర్వాత కోర్టు జోక్యం అప్రస్తుతమని వ్యాఖ్యానించింది. ప్రత్యేక కమిషన్ నివేదికను పూర్తిస్థాయి వివరాలు%-%కవరింగ్ లేఖ, కమిషన్ చైర్మన్ సంతకం లేకుండా సమర్పించడం సరికాదని న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవీ దేవి మరో కేసు విచారణలో వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, ఆ కారణంగా ఎన్నికలను నిలిపివేయాలని పిటిషనర్లు వాదించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత కోర్టు జోక్యం ఉండకూడదని ఏజీ పునరుద్ఘాటించారు. ఈ అంశంపై కూడా ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి రాజీనామా

పరీక్షల మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై వచ్చిన ఆరోపణలు, విజిలెన్స్ ప్రాథమిక విచారణలో అవే నిజమని తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వర్సిటీలో ఇష్టారీతిన ఇన్‌చార్జీల నియామకాలు, ప్రైవేట్ మెడికల్ కళాశాలలతో కుమ్మక్కు ఆరోపణలు, పాలనలో గందరగోళయిఇవి వరుసగా చోటుచేసుకోవడంతో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ దెబ్బతిన్నదనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్సిటీ పరిస్థితులపై ఆరోగ్య శాఖ అధికారుల నుంచి వివరాలు తీసుకున్న సీఎం, తప్పుదారి పట్టించే చర్యలు ఎవరివైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. తరువాత వీసీ నందకుమార్ రెడ్డి ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, సీఎస్ రామకృష్ణారావును కలిసి వివరణ అందించినప్పటికీ, ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థినికి అదనపు మార్కులు ఇచ్చి పాస్ చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నకు ఆయన సమాధానం సరిపోలేదని సమాచారం. సీఎం కార్యాలయం సమీక్షించిన నివేదికలో కూడా వీసీ పాత్ర స్పష్టమవడంతో, రాజీనామా చేయమని సూచించినట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి నందకుమార్ రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ"విద్యార్థినికి జరిగిన అన్యాయాన్ని మాత్రమే సరిచేశాను. ఆమె ఏ కళాశాల విద్యార్థినో పరిశీలించాల్సిన అవసరం అనిపించలేదు. అయితే అంశం రాజకీయ రంగు పులుముకోవడం బాధించింది. వర్సిటీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలగకూడదన్న ఉద్దేశంతోనే రాజీనామా చేశాను" అని వ్యాఖ్యానించారు. పూర్తి స్థాయి విచారణ జరిగితే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీ చేతుల మీదుగా 77 అడుగుల శ్రీరామ విగ్రహ ఆవిష్కరణ

జరిగింది. జీవోత్తం మఠం దేశంలోని తొలి సారస్వత బ్రాహ్మిణ్ వైష్ణవ మఠమని, దాని ప్రధాన కేంద్రం పార్టగాలిలో ఉందని ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, సాధువులు-సంతులతో తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని స్మరించుకున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో ప్రజలు మరింత దగ్గరవ్వడానికి ఇటువంటి వేడుకలు సహకరిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం కోసం భారీగా ఏర్పాట్లు చేయగా, దేశవ్యాప్తంగా వచ్చిన యాత్రికులు, భక్తులు, విశిష్ట అతిథులతో కలిసి దాదాపు 15,000 మంది పాల్గొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా శంకర్ మహదేవన్, అనూప్ జలోటా వంటి ప్రముఖుల సంగీత%-%సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆర్గనైజింగ్ కమిటీ జాయింట్ కన్వీనర్ ఎస్. ముకుంద్ కామత్ మాట్లాడుతూఈ కార్యక్రమం మఠ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమని, విగ్రహావిష్కరణతో ఆధ్యాత్మిక ప్రాంగణం కొత్త భవ్యతను సంతరించుకుందని పేర్కొన్నారు.

ఎంపీ వద్దిరాజుకు జీవన సాఫల్య పురస్కారం

భారత్ గౌరవ్ ఫౌండేషన్ సత్కారం

హైదరాబాద్ (హైటెక్ సిటీ) : భారత్ గౌరవ్ ఫౌండేషన్ వార్షిక పురస్కారాలు శుక్రవారం హైటెక్ సిటీలో ఘనంగా జరిగాయి. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను సత్కరించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు ఫౌండేషన్ ప్రతిష్టాత్మక “జీవన సాఫల్య పురస్కారం” (Life Time Achievement Award)ను అందజేశారు.

పురస్కారం స్వీకరించిన తర్వాత మాట్లాడిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ ల పాత్రపై ప్రత్యేకంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, రాష్ట్ర అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక పాత్రను గుర్తు చేశారు. “సామాన్య ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ, తన పదేళ్ల పాలనలో హైదరాబాద్‌ను ప్రపంచ నగరాలకు సరితూగేలా తీర్చిదిద్దిన నాయకుడు కేసీఆర్” అని రవిచంద్ర అన్నారు.

అలాగే కేటీఆర్ పనితీరును ప్రశంసిస్తూ “ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖలలో ఆయన చూపిన దూరదృష్టి వల్లే నేటి హైదరాబాద్ న్యూయార్క్, డల్లాస్, చికాగోలకు సమానంగా అభివృద్ధి చెందింది. ఐటీ, ఫార్మా, స్టార్ట్-అప్స్ రంగాల్లో హైదరాబాదు గ్లోబల్ మ్యాప్‌పై నిలిచింది” అని వివరించారు.

యువత శక్తిని వినియోగిస్తే దేశం మారుతుంది

తమ ఖమ్మం యూనిటీ రన్ సందర్భంగా యువత పెద్ద శాతం 40 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సులో ఉన్నారని గుర్తు చేసిన రవిచంద్రు “మన దేశం యువతతో నిండి ఉంది. అవకాశాలు ఇస్తే వారు ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యం ఉంది. వారి ప్రతిభ దేశాభివృద్ధికి దోహదపడాలి,” అని పిలుపునిచ్చారు.

రాజ్యసభ సభ్యుడిగా ముఖ్య ప్రాధాన్యతలు

ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా తన భవిష్యత్ కర్తవ్యాలను చెప్పుకొచ్చారు

విద్య మరియు వైద్యారోగ్య రంగాల బలోపేతానికి కృషి

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

గ్రామీణ%-%పట్టణ అభివృద్ధి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించే చర్యలు

యువత నైపుణ్యాభివృద్ధిపై పథకాలు రూపొందించే ప్రయత్నం.

కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై సందేశాలు ఇచ్చారు. వారిలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్,ప్రముఖ యోగ గురువు చిన్నజీయర్ స్వామి,ఒలింపిక్ ఛాంపియన్ సైనా నెహ్వాల్, సీనియర్ IPS అధికారి అంజనీకుమార్ ఇతరులు ఉన్నారు.

వేదికపై ఎంపీ రవిచంద్రను నిర్వాహకులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ సందేశ్ యాదవ్ మరియు బృందం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ప్రత్యేక అతిథుల ప్రసంగాలు, పురస్కార గ్రహీతల అనుభవాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మెట్రోకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షనీయం

ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు

కూకట్ పల్లి, నవంబర్ 28(వాయిస్ టుడే) నగర రాజధాని హైదరాబాద్ హైటేక్ సిటి రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ఇందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. అమృత్ భారత్ పథకం కింద రూ.26 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ప్రయాణికుల కు ఇబ్బంది లేకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. కూకట్ పల్లి ప్రజలకు సురక్షితమైన, సులభతరమైన ప్రయాణ సౌకర్యాలు అందించేందుకు కూకట్ పల్లి మెట్రో రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి కూకట్ పల్లి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జీ మాధవరం కాంతారావు అభ్యర్థన మేరకు రూ.10 కోట్లను కేటాయించి నందుకు కిషన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి బిజెపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తుమ్మ సౌజన్య కుమారికి రెండు లక్షల రూపాయల LOC ని అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ నవంబర్ 28(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ, ఉమామహేశ్వరి కాలనీలో నివాసం ఉంటున్న తుమ్మ సౌజన్య కుమారి గత కొన్ని రోజుల నుండి పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్యుల సూచన మేరకు మెరుగైన శాస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక స్థోమత లేకపోవడంతో బాధితురాలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కలసిన అడిగిన వెంటనే రెండు లక్షల రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేపించి లబ్ధిరాలుకు అందజేయడం జరిగింది. అనంతరం లబ్ధిరాలు రాష్ట్ర ముఖ్యమంత్రి , సహా మంత్రి, కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్,బాలప్ప ,మోటే శ్రీనివాస్ , కూన రాఘవేందర్ గౌడ్ , కృష్ణ యాదవ్ , రాకేష్ పాటు లబ్ధిరాలు, తదితరులు పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణం విషయంలో అధికారులు మేల్కొని ఆ నిర్మాణాన్ని కూల్చివేయాలి

పోతగాని గోపాల్ గౌడ్

నాచారం (వాయిస్ టుడే):నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ సర్వే No. 106లో జరుగుతున్న అక్రమనిర్మాణం విషయంలో మొదటి నుండి అక్రమనిర్మాణం ఆపివేయాలంటూ ఇది కాలనీ పార్క్ కోసం కేటాయించిన స్థలమని, స్థానిక వెస్లీ ప్రభుత్వ పాఠశాలకు ప్రధాన రహదారిగా ఉన్న దారి స్థలంలో నిర్మాణం ఎలా చేపడతారని కాలనీవాసులతో కలసి సంభంధిత అధికారులను అనేక మార్లు కలసి వినతిపత్రాలు అందచేసి అధికారుల నుండి ప్రతి నిత్యం పురోగతి తెలుసుకుంటూ జిల్లా న్యాయస్థానంలో ఈ అక్రమ నిర్మాణానికి సంభందించిన అసలు పత్రాలను అందచేసి ఎంతో ప్రయాశపడిన జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్.ఇంతటి కష్టానికి గాను నేడు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షించదగిన విషయం.అదే విధంగా హైకోర్టు తీర్పును వెంటనే అమలుపరచి ఇట్టి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని,కోర్టు ఆదేశానుసారం విద్యుత్ నిలిపి వేయాలి, బిల్డింగ్ సీజ్ చేయాలని తప్పుడు ధ్రువపత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టించి అనుమతులు పొందిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నట్లు పోతగాని గోపాల్ గౌడ్ తెలిపారు.అధికారులు స్పందించకుండా జాప్యం చేసినట్లయితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

లోక్ జనశక్తి పార్టీ రాంవిలాస్ 25 ఏళ్ళ ఆవిర్భావం భేష్

శేరిలింగంపల్లి, నవంబర్ 28 (వాయిస్ టుడే): నిరుపేదల కోసం ఉపాధి విద్యా అవకాశాలు, బీహార్ ప్రజల సంక్షేమం కోసం నాడు రామ్ విలాస్ పాశ్వాన్ ఏర్పాటు చేసిన లోక్ జనశక్తి పార్టీ రాంవిలాస్ పార్టీ నేడు 25 ఏళ్ళు పూర్తి చేసుకోవడం అబినందనీరమని తెలంగాణ రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ లేబర్ సెల్ అధ్యక్షులు సురేందర్ అన్నారు. అంచలంచలుగా నేడు బీహార్ రాష్ట్రంలో చిరాగ్ పాశ్వాన్ తండ్రి ఏర్పాటుచేసిన పార్టీని అద్భుతంగా ముందుకు తీసుకు వెళుతున్నారని, బీహార్ లో నేడు 5 ఎంపీలు 19 ఎమ్మెల్యే సీట్లలో రెండు మంత్రి పదవులతో దేశంలో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ఒక ప్రత్యేకతను సంపాదించుకుందని సురేంద్ర తెలిపారు. భవిష్యత్తులో రాబోయే బీహార్ ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ జనశక్తి పార్టీ రామ్ విలాస్ ఊహించని విజయాలతో ప్రభంజనం సృష్టించనుందని సురేందర్ పేర్కొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో ఘనంగా మహాత్ముని వర్ధంతి

పాతపల్లి శివ శంకర్‌ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే కు నివాళులు

కూకట్‌పల్లి, నవంబర్ 28(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం మూసా పేట డివిజన్ పరిధిలో శుక్రవారం ఘనంగా మహాత్ముని వర్ధంతి ఈ నేపథ్యంలో పాతపల్లి శివ శంకర్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యతిగా మాజీ కార్పొరేటర్ తుము శ్రవణ్ కుమార్ ఆయన మాట్లాడుతూ భారత సామాజిక విప్లవ పితామహుడు. మనస్మృతి తిరస్కరించిన గొప్ప విద్యా వేత్త. మహాత్మ జ్యోతిబాపూలే ఒక గొప్ప సంఘసంస్కర్త అని, అంబేద్కర్ గురువు. మహిళా విముక్తి కోసం పాటుపడిన మొదటి వ్యక్తి, స్త్రీ అభ్యున్నతి కోసం స్త్రీలు చదువుకోవాలని ముందుగా తన భార్య అయిన సావిత్రిబాయి పూలేను పాఠశాలకు పంపించడం జరిగింది. విద్య అనేది అందరి హక్కు. అని విద్య అనేది అందరికీ సమానంగా అందించాలని కోరుకున్న మహానుభావుడు. మనువాదం అనేది మనిషిని మనిషిగా గుర్తించదు దేశంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను 85% బానిసలుగా మలిచింది మనువాదమే తెలియజెప్పిన ధీరుడు. ఎన్నో రచనలు చేసి ఎంతో పాండిత్యాన్ని ప్రజలకు అందించి చైతన్యపరిచిన ఉపాధ్యాయుడు. భావితరాలకు బాటలు వేసిన భవదీయుడు. మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా ఇవే మా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ జి. తుకారాం, జెల్ల సురేష్, పెరుమాండ్ల నర్సింగ్ రావు, దముల స్వర్తిక్,, పాతపల్లి చిన్న, మరియూ ఇతరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ఎ, నవంబర్ 28(వాయిస్ టుడే): (కుత్బుల్లాపూర్ నియోజకవర్గం) పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000/- , ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) ని మంజూరు చేయించి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మల్లంపేట్ వాసులు కృష్ణ చారి రూ. 60000/-,129 డివిజన్ షాపూర్ నగర్ వాసులు హన్మంత్ రావు 52,500/-, డి. పోచంపల్లి వాసులు అబ్దుల్ ఖాదర్ రూ 31500/-, నిజాంపేట్ వాసులు పి,కీర్తి 20000/-, 132 డివిజన్ జీడిమెట్ల వాసులు సి ఎచ్ సంతోష్ కుమార్ 26000/-, ప్రగతినగర్ వాసులు సీత రత్నం 60000/- సీఎంర్ఫ్-మంజూరి పత్రాలను (చెక్కులు) అందజేశారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోలా సంజీవ్ రెడ్డి, పండరి రావు, గణేష్, బల్ రెడ్డి, మరియు మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దీక్షా దివాస్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద మాధవరం కృష్ణ రావు

కుత్బుల్లాపూర్ నవంబర్ 28 (వాయిస్ టుడే): శనివారం రోజున మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరగబోయే దీక్షా దివాస్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద మాధవరం కృష్ణా రావు మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ నవంబర్ 28(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి శివాలయం గుడి వద్ద ఆగం పాండు, షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్ లో కూన సంజయ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ అయ్యప్ప స్వాములు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేమూరి రాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్ , చెన్నారెడ్డి , షాకీర్ , పాటు అయ్యప్ప స్వాములు , భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతి: ఘన నివాళులు అర్పించిన ఎన్.ఎం.సి. బిఆర్ఎస్ పార్టీ నాయకుల

కుత్బుల్లాపూర్ నవంబర్ 28(వాయిస్ టుడే): భారతదేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు విశేషంగా కృషి చేసి, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిచిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతి సందర్భంగా నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసి) పరిధిలోని బాచుపల్లి సాయి నగర్ లో మహాత్మా ఫూలే విగ్రహానికి నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్.ఎం.సి. బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు సాంబశివరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ, మహాత్మా ఫూలే ఆశయాలను, ఆయన చూపిన బాటను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, అప్పుడే ఆయనకు సరైన నివాళులు అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలగం చంద్రయ్య,రామ్ నరసయ్య, ఆంజనేయులు,కురుమూర్తి, నర్సింగ్, నాయకురాలు భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు

కుత్బుల్లాపూర్ నవంబర్ 28(వాయిస్ టుడే): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (టీపీసీసీ) మహేష్ కుమార్ గౌడ్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు నూతనంగా ఎన్నికైన మెదక్ డిసిసి అధ్యక్షులు అంజనేయులు గౌడ్ వారితోపాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి కలిసి టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్ నవంబర్ 28 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ లోని దేవేందర్ నగర్ లో నివసించే బండారి అంజయ్య(52) వృత్తిరీత్యా డ్రైవర్ అతని పెద్ద కొడుకు బండారి ఉదయ్ కిరణ్ శుక్రవారం తెల్లవారుజామున నిద్ర లేచి చూసేసరికి తన తండ్రి మరణించి ఉన్నాడని మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు పై మేడిపల్లి సిఐ ఆర్. గోవిందరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అని తెలిపారు.

జ్ఞాన సముపార్జన ద్వారానే 'రాజ్యాధికార సాధన'

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): జ్ఞాన సముపార్జన ద్వారానే రాజ్యాధికార సాధన జరుగుతుందని అందరికన్నా ముందే సిద్ధాంతికరించింది మహాత్మా ఫూలే అని ఎస్విఎకే కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టి పి ఎస్ కే) ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే 135 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ వినయ్ కుమార్ ఫూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువు మూలంగానే బ్రాహ్మణాధిపత్యం ఈ సమాజంలో స్థిర పడిందని విషదీకరించారు. అందుకే తమ ఆధిపత్యానికి ఎక్కడ ఏ చిన్న నష్టం జరగకుండా ఉండేందుకు వాళ్ళు మనుస్మృతి ని పగడ్బందీ గా పాటించి, మరెవ్వరికీ చదువు ఒంట పట్టకుండా శతాబ్దాలుగా అడ్డుకున్నారని అన్నారు. కులాలుగా, వర్ణాలుగా సమాజాన్ని విభజించి తమ ఆధిపత్యాన్ని నిరంతరాయంగా వేల యేళ్ళ నుంచి కొనసాగించారన్నారు. ఈ ఆధిపత్యాన్ని వారి బానిస భావాజాలాన్ని చదువు ద్వారా మాత్రమే క్షుద్ర కులాల వారు ఎదుర్కోవాలని మహాత్మా ఫూలే బోధించాడని చెప్పారు. "జ్ఞాన రాహిత్యం" వల్లనే శ్రామిక జనం బానిసత్వం లోకి నెట్టివేయ బడ్డారని విడమరిచి చెప్పాడన్నారు. విద్య లేనిదే మేధస్సు లేదు మేధస్సు లేక నైతికత ఉండదు. నైతికత లోపించినప్పుడు శక్తి సంపన్నత కలగదు అది లేక సంపదలు సమకూరవు అంటే ? సర్వ అనార్థాలకు మూలం విద్యా-విజ్ఞానాలు లేకపోవడమే అని ఫూలే సిద్ధాంతీకరించారని అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుట్టబోయే ప్రతి శిశువుకు ఫులే గురించి చెప్పాలనీ, చీకటి దొంతరుల్లో నక్షత్రాల పందిరి వేసినవాడు లోయల్లో కునారిల్లుతున్న స్త్రీని పర్వత శిఖరాగ్రాన నిలబెట్టినవాడు మతోన్మాద అగ్ని శిఖల్లో దగ్ధమవుతున్న మహిళను రక్షించి విద్యా కిరీటం పెట్టినవాడు పితృస్వామ్య ఆదిపత్యాన్ని ఎదిరించి మాతృస్వామ్యాన్ని స్థాపించిన నిర్మాత అని అన్నారు. దశావతారాల నుంచి హంతకులను ప్రకటించి మూలవాసుల చరిత్రకు ఊపిరి లూదారని అన్నారు. మనుస్మృతి విద్యావ్యవస్థ, విష కౌగిట నుంచి బహుజనులను విముక్తి చేసినవాడు అని, మానవతా మూర్తి సాంస్కృతిక విప్లవ యోధుడు అంబేద్కర్ పోరాటానికి వెన్నెల బాట వేసిన విద్యా వారదుడని అన్నారు. ఆయన నూరిన ఖడ్గాన్ని ధరిద్దాం..! సామాజిక విప్లవ యోధులుగా ముందుకు నడుద్దాం అని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పొన్నం రాజయ్య, ఎన్ వేణుగోపాల్ కందుకూరి,రజిత, కవిత, ఇందిరా పోటీ పరీక్షల విద్యార్థులు యూనివర్సిటీ స్కాలర్స్, తదితరులు పాల్గొన్నారు

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుంది బీజేపీ నేతలే

ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

హైదరాబాద్ : పట్టపగలు బీసీ ల గొంతు కోసిన బీజేపీ నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు. బీసీ లకు రిజర్వేషన్ల రాకుండా అడ్డుకున్నది బీజేపీ నాయకులని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బీసీ ద్రోహులు , వెన్నుపోటుదారులు బీజేపీ నాయకులే. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా బీజేపీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకుండా నోరు మూసుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడు రేవంత్ రెడ్డి పైన ఎగిరెగిరిపడుతున్నరు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కు కనీసం సిగ్గనిపించడం లేదు.. ఆయన కూడా మా రేవంత్ రెడ్డి మీద మాట్లాడుతున్నడు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చి.. ఢిల్లీలో మాట మార్చింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. బీసీలకు తీరని అన్యాయం చేసింది బీజేపీ. జంతర్ మంతర్ దగ్గర మేం ధర్నాలు చేశాం..రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోసం పడిగాపులు పడ్డాం. బీజేపీ ద్రోహాన్ని బీసీలు గమనించి సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలి. బీసీ బిడ్డ గా ఉన్న బీసీలకు ద్రోహం చేస్తున్నది లక్ష్మణ్ . బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు గా ఉన్న లక్ష్మణ్ బీసీ బిల్లు ఆమోదించాలని మోదీ మీద ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు..? తన పదవి పైన తప్ప బీసీ లపైన ఇసుమంత ప్రేమ కూడా లక్ష్మణ్ కు లేదు. గాంధీ కుటుంబం గురించి లక్ష్మణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. సోనియా , రాహుల్ త్యాగాల కుటుంబం నుంచి వచ్చారు. ప్రధాని పదవే వాళ్లు త్యాగం చేశారు.. అది మరచిపోయి లక్ష్మణ్ మాట్లాడుతున్నాడు. ఎప్పటికైనా బీసీలకు రిజర్వేషన్లు సాధించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. బీసీ రిజర్వేషన్ల పైన కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని ఇప్పటికే నిరూపించుకుందని అన్నారు.

కే.సీ.ఆర్. కృషి కారణంగానే తెలంగాణా రాష్ట్రం సిద్ధించింది

దీక్షా దివస్ ను జయప్రదం చేయాలి...

ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్....

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీ ఆర్ తన ప్రాణాలను లెక్క చేయకుండా చేపట్టిన దీక్ష రోజును దీక్షా దివస్‌గా నిర్వహించే పద్ధతిని పాటిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండి లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్. నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ కే.సీ.ఆర్. కృషి కారణంగానే తెలంగాణా రాష్ట్రం సాధించుకోగలిగామని తెలిపారు. శనివారం సికింద్రాబాద్ నుంచి తెలంగాణా భవన్ కు భారీగా కార్యకర్తలు తరలి రావాలని, సితాఫలమండీ నుంచి ఉదయం బయలుదేరాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వియయవంతం చేసేందుకు కార్పొరేటర్లు, నాయకులు కృషి చేయాలి. సమావేశం లో కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీత, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, సమన్వయకర్త రాజ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రోవాస్క్యులర్ & ఎండోవాస్క్యులర్ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ ప్రారంభం

సికింద్రాబాద్,నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): తొలి ఎడిషన్ అద్భుతమైన విజయాన్ని సాధించిన స్ఫూర్తితో, రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (RINS), పాన్ రీసెర్చ్ ఫౌండేషన్, ప్రతిష్ఠాత్మకమైన సెరెబ్రోవాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (CVSI) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యక్రమం (నవంబర్ 28, 29) రెండవ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్, మైక్రోవాస్క్యులర్ % ఎండోవాస్క్యులర్ స్కిల్ ట్రైనింగ్ ఆన్ లైవ్ యానిమల్స్ అండ్ మాడ్యూల్స్' అనే అంశంపై రాజేంద్రనగర్ లోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ ప్రతిష్ఠాత్మక హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ ను, రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (RINS), బంజారా హిల్స్, హైదరాబాద్,పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (PVNRTVU) రాజేంద్రనగర్, హైదరాబాద్ కి చెందిన కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యూరోసర్జన్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డా. ఐ. దినకర్, ఫౌండర్ & సీఈఓ, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ శ్రీధర్ పెద్దిరెడ్డి ల ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్-చాన్సలర్ & చైర్మన్, పీవీఎన్ ఆర్టీవీయూ ప్రొ. జ్ఞాన ప్రకాశ్, గౌరవ అతిథులుగా సీనియర్ న్యూరోసర్జన్ డా. కె.వి.ఆర్. శాస్త్రి, సీనియర్ న్యూరోసర్జన్ డా.బి.సి.ఎం. ప్రసాద్ లు హాజరై ప్రారంభించారు. ప్రత్యేక అతిథులుగా డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ పీవీఎన్ఆర్టీవీయూ డా. ఎం. ఉదయ కుమార్, ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్, పీవీఎన్ఆర్టీవీయూ డా.బి.స్వాతి లు పాల్గొన్నారు.

ఈ వర్క్‌షాప్ దేశవ్యాప్తంగా ఉన్న న్యూరోసర్జన్లు, ఫెలోలు, రెసిడెంట్లు ఒకేచోట చేరి తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే సమగ్ర అనుభవాన్ని అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షణా మాడ్యూల్స్ వివరాలు..

మైక్రోవాస్క్యులర్ స్యూచరింగ్

జంతు కణజాలం, హై-ఫిడిలిటీ మోడల్స్ ఉపయోగించి వెస్సెల్ అనాస్టమోసిస్, లైవ్ యానిమల్ ఆపరేటివ్ ట్రైనింగ్, ఎండోవాస్క్యులార్ సిమ్యులేషన్ సెషన్స్

ఈ సందర్భంగా డా. సయ్యద్ అమీర్ బాషా పస్పాలా మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యం శస్త్రచికిత్సా ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, బహుళ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమేనన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా పాల్గొనే వారిలో న్యూరోవాస్క్యులర్ నైపుణ్యాలు మరింత బలోపేతం అవుతాయని, అదే సమయంలో టీమ్ వర్క్, వృత్తిపరమైన అభివృద్ధిలో గణనీయమైన ఎదుగుదలకు ఈ శిక్షణ తోడ్పడుతుందని విశ్వసిస్తున్నామన్నారు. ఈ వర్క్‌షాప్ కేవలం శిక్షణ మాత్రమే కాదు, న్యూరోవాస్క్యులర్ శస్త్రచికిత్స యొక్క భవిష్యత్తును మెరుగుపరచడానికి చేస్తున్న ఒక పెట్టుబడి," అని చెప్పారు. ఈ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించేందుకు విశేషంగా సహకరించిన పివిఎన్ఆర్టీవీయు కి ధన్యవాదాలు తెలిపారు. డా. టీ.వి. రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. గత సంవత్సరం వేసిన శిక్షణా పునాదిని ఈసారి మరింతగా బలోపేతం చేయగలిగాం. ఈ వర్క్‌షాప్‌లోని ప్రతి శిక్షణా మాడ్యూల్ ను నిర్మాణాత్మకంగా, దశలవారీ (స్టెప్-బై-స్టెప్) మార్గదర్శకంతో రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే న్యూరోసర్జన్లు, ఫెలోలు, రెసిడెంట్లు తమ శస్త్రచికిత్సా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవడంతో పాటు, చికిత్సలో అవసరమైన కచ్చితత్వాన్ని సాధించేందుకు ఇది సహాయ పడుతుందన్నారు. వాస్తవ న్యూరోవాస్క్యులర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం, సాంకేతిక దక్షతను అభివృద్ధి చేసుకునేందుకు ఈ శిక్షణ కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ అడ్వైజరీ సభ్యులు, CVSI కార్యవర్గ సభ్యులు, ఫ్యాకల్టీ మరియు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌కు దేశవ్యాప్తంగా 60 మందికి పైగా న్యూరోసర్జన్ ఫెలోలు, రెసిడెంట్లు హాజరయ్యారు.

కొత్త అక్రెడిటేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో ప్రత్యేక పాలసీ తీసుకురావాలి..

అన్ని ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో అమలయ్యేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి...

హెచ్‌యూజే (టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం డిమాండ్...

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్?యూజే బి టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అక్రెడిటేషన్ కార్డుల గడువు ముగిసి 18నెలలు కావస్తున్నా ఇప్పటికీ పొడిగింపు స్టిక్కర్లతోనే సమాచార శాఖ కాలం గడుపుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అక్రెడిటేషన్ పాలసీని ప్రకటించకపోవడం జర్నలిస్టుల పై ప్రభుత్వానికున్న వైఖరికి నిదర్శనమని హెచ్ యూజే కార్యవర్గం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ త్యాగరాయ గానసభ లో హెచ్ యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ అధ్యక్షతన ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. వృత్తిపరంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపై నాయకులు కూలంకుషంగా చర్చించారు. జర్నలిస్టులకు ఇండ్ల జాగాల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య జటిలమైందనీ, ఈ నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు న్యాయం చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని హెచ్? యూజే కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యచికిత్సలు అందేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షులు, అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్ మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి హెచ్?యూజే నాయకులు కృషి చేయాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జనవరి మొదటి వారంలోనే హెచ్ యూజే నూతన సంవత్సర డైరీ ని ఆవిష్కరించుకోవాలనీ, ఆ దిశగా కార్యవరం పని చేయాలని ఆకాంక్షించారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు గుడిగ రఘు మాట్లాడుతూ... వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను రద్దు చేసి కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్‌యూజే కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ.. సంఘం కార్యక్రమాలను వివరించారు. సభ్యత్వ నమోదు పూర్తిచేసి డిసెంబర్ చివరి వారంలో సంఘం మహాసభ నిర్వహిస్తామని చెప్పారు. హెచ్ యూజే అధ్యక్షుడు బి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు మాత్రమే చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని అన్నారు. కోశాధికారి బి. రాజశేఖర్.. సంఘ నిర్మాణం, సభ్యత్వాలు, ఇతర అంశాలను వివరించారు. కాగా నియోజకవర్గ మహాసభలు పూర్తి చేసుకొని డిసెంబర్ చివరి నాటికి హెచ్ యు జె మహాసభ నిర్వహించాలని, సంఘ నియమాలను అతిక్రమించిన సభ్యుడు మామిడి సోమయ్య ప్రాథమిక సభ్యత్వం రద్దు చేయాలని కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఇటీవల కాలంలో మృతిచెందిన జర్నలిస్టులకు సంతాప సూచకంగా సమావేశం ప్రారంభంలో కార్యవర్గం రెండు నిమిషాలు మౌనం పాటించింది. సమావేశానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు సలీమా, రాధిక, నిరంజన్, హెచ్ యూజే నాయకులు మధుకర్, రమేష్, బాలు, నిస్సార్, లలిత, విజయ, ప్రశాంత్, రేణయ్య, లక్ష్మణ్ రావు, రాజేశ్, మాధవ రెడ్డి, కాలేబ్, సర్వేష్, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

సినిమా థియేటర్ల దోపిడిని నియంత్రించాలి

ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి.వై.ఎల్)

సంధ్య థియోటర్ వద్ద సంతకాల సేకరణ

సికింద్రాబాద్,నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలో సినిమా థియేటర్లలో దోపిడి పెరిగిపోయిందని, దీనిని నియంత్రించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి.వై.ఎల్) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సంధ్య థియోటర్ లో సంతకాల సేకరణ కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వై.ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు బి. ఎస్ కృష్ణ, కొల్లూర్ భీమేష్ మాట్లాడుతూ.. ప్రేక్షకులను సినిమా థియేటర్ల యాజమాన్యాలు దోపిడి చేస్తున్నాయన్నారు. కొత్త సినిమా విడుదల రోజున బెనిఫిట్ షో లు వేస్తూ ఒక్క టికెట్ ను వేయి నుండి మూడు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొంత మంది చేతుల్లోనే ఎక్కువ థియేటర్లు ఉండడంతో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నరని అన్నారు. బెనిఫిట్ షోలు రద్దు అని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి, తర్వాత చేతులెత్తేశారని అన్నారు. ఆహ్లాదం కోసం, అభిమాన హీరో సినిమా కోసం సినిమా థియేటర్లకి వస్తే, దానిని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నాయని అన్నారు. థియేటర్లకి వెళ్తే స్నాక్స్ వందల్లో వసూల్ చేస్తున్నారని, బయట నుండి మాత్రం లోపలికి స్నాక్స్ తీసుకెళ్ళనివ్వకుండా వాళ్లే అధిక ధరలకు అమ్ముతున్నారని, దీనిని అధికారులు ఎందుకు నియంత్రించడం లేదని ప్రశ్నించారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలి, దానిని కూడా వదల కుండా వసూల్ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై అధికారులు, ప్రభుత్వం స్పందించాలన్నారు లేని యెడల యూత్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి కుంటోజి కిరణ్, ఉపాధ్యక్షులు బంగారి శ్రీనివాస్, నాయకులు అంజి, లింగంపల్లి రాజు,రాంబాబు, నాగయ్య, రాము, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ చేపట్టాలి

ఓయూ టీచర్స్ అసోసియేషన్

59 వ రోజుకు చేరిన ఓయూ అధ్యాపకుల ఆందోళన

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ప్రమోషన్లలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ప్రొఫెసర్లు చేస్తున్న నిరసనలు 58వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సైన్స్ కళాశాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ అర్హులకు ప్రమోషన్ నిరాకరించి, తన అడుగులకు మడుగులొత్తేవారికే పదవులు, ప్రమోషన్లు వస్తాయని పరోక్షంగా చెబుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనుకుంటున్న సమయంలో అధికారుల నిర్లక్ష్యం వర్సిటీకి శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ప్రమోషన్లపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్, అధ్యాపకులు ప్రొఫెసర్ కమలాకర్, ప్రొఫెసర్ రామచందర్, డాక్టర్ వెంకట్ దాస్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ లోఖండే, డాక్టర్ మాధురి, డాక్టర్ అరవింద్, డాక్టర్ సుజాత, డాక్టర్ శశికళ, డాక్టర్ రామకృష్ణగౌడ్, డాక్టర్ రాకేశ్బాబు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు ఫూలే 135వ వర్ధంతి

బీసీ నేతల ఘన నివాళులు

హైదరాబాద్, కోఠి:వాయిస్ టుడే : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం అహర్నిశలు కృషి చేసి "దీనజన భాంధవుడు"గా పేరుపొందిన మహాత్మ జ్యోతిరావు ఫూలే గారి 135వ వర్ధంతి సందర్భంగా బీసీ నేతలు కొండ దేవయ్య, పోలాస నరేందర్ ఘన నివాళులు అర్పించారు. కోఠిలోని బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవార్పణ చేశారు. బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ.. "విద్య మనిషిని మార్చే శక్తి. అది వజ్రాయుధం అని విశ్వసించిన మహాత్మా ఫూలే, ఆ విద్య అందరికీ అందాలి అనే దృక్పథంతో మొదటి పాఠశాలలను స్థాపించారు. తన భార్య సావిత్రీబాయి ఫూలేను విద్య కోసం ముందుకు నడిపి మహిళా విద్యకు బాటలు వేసారు. ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరపురాదిది" అని పేర్కొన్నారు. బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జి పోలాస నరేందర్ మాట్లాడుతూ.. "మహాత్మా జ్యోతిరావు ఫూలే %-% సావిత్రిబాయి దంపతులు 40 ఏండ్లపాటు సామాజిక సమానత్వం కోసం ఉద్యమాలు నడిపారు. బడుగు బలహీన వర్గాలు విద్య, ఉపాధి, ఉద్యోగం, సామాజిక-రాజకీయ రంగాల్లో ఎదగాలని నిత్యం పోరాడారు. మహిళలు, వితంతువులు, గర్భిణీలపై జరుగుతున్న అన్యాయాలకు ఆయన ఎదురు నిలిచారు" అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయండి

బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగంటి రాజు నేత

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీ రిజర్వేషన్లను పాత పద్ధతి ప్రకారమే తగ్గించి అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 29న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో 12,728 గ్రామపంచాయతీలలో, మండలాలలో, నియోజకవర్గాలలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగంటి రాజు నేత పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం బీసీలు అంటే కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంటుంది తప్ప రాజ్యాధికారం కట్టబెట్టే ప్రయత్నం ఎక్కడ కూడా చేయడం లేదని రాజు నేత విమర్శించారు. జీవో నెంబర్ 46 ప్రకారం బీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లు కేవలం 17 శాతమే ఉన్నందున 12 వేల పైగా ఉన్న గ్రామపంచాయతీలలో కేవలం 1200 గ్రామ పంచాయతీలు మాత్రమే బీసీలకు రిజర్వేషన్లలో కేటాయించినట్టు లెక్కల్లో తేలిందని ఇది తీరని అన్యాయమని అన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ తరఫున బీసీల కోసం పోరాటం జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు బీసీలు నిలదీయాలని సర్పంచ్ ఎన్నికలు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తుక్కుతుక్కుగా ఓసర్పంచ్ ఎన్నికలు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తుక్కుతుక్కుగా ఓడించాలని రాజు నేత తెలిపారు.

ఓయూలో కీచక గురువు!

సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ప్రిన్సిపాల్

సికింద్రాబాద్, నవంబర్ 28 (వాయిస్ టుడే ప్రతినిధి): ఈ మధ్యకాలంలో మనుషులు మానవత్వాన్ని మర్చిపోతున్న సంఘటనలు అనేకం. అందులోనూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే కీచక అవతారం ఎత్తుతున్న సంఘటనలు... అలాంటి సంఘటనే ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఓయూ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న బాధిత విద్యార్థినులు మాట్లాడుతూ తమతో అధ్యాపకుడు రవీందర్ అనుచితంగా ప్రవర్తించేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవైనా అడిగితే తన చాంబరు కు రావాలని చెప్పేవాడని వాపోయారు. తరగతులు ముగిసిన అనంతరం సెల్ఫోన్లో చాటింగ్ చేయడం, ఫోన్ చేయమని మెసేజ్లు చేస్తూ వేధించేవాడని చెప్పారు. బయటకు వెళ్ళే తానూ వస్తానని అనేవాడని అన్నారు. భయంభయంగా కళాశాలకు వచ్చే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కళాశాల పరిస్థితులను పూర్తిగా అవగతం చేసుకునే లోపే ఈ వేధింపులకు గురయ్యామని భోరుమన్నారు. బీటెక్ లో చేరిన మొదటి సంవత్సరమే ఇలాంటి వేధింపులకు గురవుతుండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థినులు తమలో తాము కుమిలిపోయామని, చివరికి విసిగివేసారిన విద్యార్థినులు తోటి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని, తక్షణమే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకుడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం: ప్రిన్సిపాల్

ఘటనపై ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్ కుమార్ను వివరణ కోరగా విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించినట్లు విద్యార్థినులు, తమను సైతం మానసికంగా వేధిస్తున్నట్లు విద్యార్థులు వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో గతంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. మొదటి సారి తమ దృష్టికి ఈ సమస్య వచ్చిందన్నారు. దీనిపై విద్యార్థినులను ప్రత్యేకంగా వుమెన్ సెల్ సభ్యులతో సమావేశపరిచి, సమస్యను పూర్తిగా తెలుసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఉన్నతాధికారుల అనుమతి ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకుడు డాక్టర్ రవీందర్న సంప్రదించగా, తాను కొంతకాలంగా బీటెక్ (బయోటెక్నాలజీ) కోర్సు ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీనిని అడ్డుకునేందుకు కొంతమంది కావాలని తనను టార్గెట్ చేసి, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

మేడిపల్లి గిరిజన బాలికల హాస్టల్ సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబెర్ గోగుల సరిత

మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యులు గోగుల సరిత, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మరియు బండారి రవీందర్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థినులతో మాట్లాడుతూ,వసతి సౌకర్యాలు,భోజన నాణ్యత,భద్రతా,మౌలిక సదుపాయాల లభ్యత వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై అవగాహన కలిగి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ మజర్, నాగరాజు, మహిళా నాయకులు శ్రీలత భద్రు నాయక్, వెంకటేష్ యాదవ్, సుమిత్ రెడ్డి, సుధాకర్, సందీప్ నేత, తదితరులు పాల్గొన్నారు.

జీవో 46తో పంచాయతీ ఎన్నికలు అన్యాయం

గన్ పార్క్ వద్ద విద్యార్థుల ధర్నా

బీసీలకు చట్టబద్ధ 42% రిజర్వేషన్లు అమలయ్యేంతవరకు పోరాటం ఆగదు : బీసీ జేఏసీ

హైదరాబాద్, గన్ పార్క్: (వాయిస్ టుడే): పంచాయతీ ఎన్నికల్లో చట్టబద్ధంగా ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా, జీవో – 46 ఆధారంగా పార్టీపర రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు గన్ పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థుల ఈ నిరసనకు మద్దతుగా బీసీ జేఏసీ చైర్మన్ అర్. కృష్ణయ్య, జేఏసీ నేతలు వకులాబరణం కృష్ణ మోహన్, కొండ దేవయ్య, పోలాస నరేందర్ పాల్గొన్నారు.

"చట్టబద్ధ 42% రిజర్వేషన్లు అమలయ్యేంతవరకు బీసీల పోరాటం ఆగదు" : అర్. కృష్ణయ్య

బీసీ జేఏసీ చైర్మన్ అర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. "కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలైన తరువాతే ఎన్నికలు జరుపుతామని ప్రభుత్వమే వాగ్దానం చేసింది. ఇప్పుడు మాత్రం కేంద్రం ఆమోదం లేదని, కోర్టులు అడ్డు పడుతున్నాయని చెబుతూ 46 జీవోపై ఎన్నికలు నిర్వహించడం బీసీ రిజర్వేషన్లను బలహీనపరిచే ప్రయత్నం" అని విమర్శించారు.

పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికల్లో పార్టీ పర రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

"హామీలు నెరవేర్చాకే ఎన్నికలు జరపాలి" : వకులబరణం కృష్ణ మోహన్

మాజీ బీసీ కమీషన్ చైర్మన్ వకులబరణం కృష్ణ మోహన్ మాట్లాడుతూ,.. "46 జీవోతో జరిగే ఎన్నికల్లో గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్లలో కూడా బీసీలకు కేవలం 17 శాతం మాత్రమే దక్కుతోంది. రిజర్వేషన్లను తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. ఇది బీసీలపై మరొక అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఎన్నికలొస్తేనే బీసీలు గుర్తొస్తున్నారు" – కొండ దేవయ్య, పోలాస నరేందర్

బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య, ఉత్తర తెలంగాణ ఇంచార్జి పోలాస నరేందర్ మాట్లాడుతూ.. "ఎన్నికల సమయంలోనే బీసీలకు హామీలు ఇస్తున్నారు. ఎన్నికల తరువాత ఎరుదాటాక తెప్పెను తగులబెట్టినట్లు వాగ్దానాలను విస్మరిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన 3000 కోట్ల గ్రామాభివృద్ధి నిధులు ఆగిపోయాయి" అన్నారు.

అలాగే, "కేంద్రం, కోర్టులు అడ్డుపడుతున్నాయని ప్రభుత్వ వాదనలు సరైనవి కావు. రాష్ట్ర పరిధిలో ఉన్న మంత్రివర్గం, నామినేటెడ్ పోస్టుల్లో జనాభా దామాషా ప్రకారం ఎందుకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులతో పాటు పలువురు బీసీ సంఘాలు, యువజన, విద్యార్థి సంఘాలు ధర్నాలో పాల్గొని 42 శాతం చట్టబద్ధ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశాయి.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బీజేపీయే

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్

హైదరాబాద్, నవంబర్ 28: తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ నేతలేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. శుక్రవారం బర్కత్ పుర లోని తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీల నడ్డి విరిచిన బీజేపీ నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని, బీసీ ద్రోహులైన బీజేపీ నాయకులు అడ్డుకుని బీసీలకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ బిల్లులను రాష్ట్ర గవర్నర్ కు, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి పంపిస్తే బిల్లులను ఆమోదించకుండా కాలయాపన చేశారని ఆయన దృజమెత్తారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకుండా బీజేపీ నాయకులు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చి ఢిల్లీలో మాట మార్చింది బీజేపీ కాదా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ చేస్తున్న కుట్రలను గమనించి సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతుదారులను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎప్పటికైనా తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను సాధించేంది కాంగ్రెస్ పార్టీనే అని అయన ధీమా వ్యక్తం చేశారు. కొంతమంది గాంధీ కుటుంబం గురించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ప్రధాని పదవినే త్యాగం చేసిన గొప్ప చరిత్ర గాంధీ కుటుంబానికి ఉందని అన్నారు.

అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..!

బోడుప్పల్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం

పాల్గొన్న బోడుప్పల్ మాజీ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్

వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 28 మేడిపల్లి : అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం అవరణంలో శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాం సుందర్ రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరై లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.పట్టాలు అందుకున్న వారిలో ఆనందం వెల్లివిరిసింది.నాయకులకు, కమిటీ సభ్యులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సంధర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కల నెరవేరుతుందని,సన్న బియ్యం పంపిణి, రెండు లక్షల రూపాయలు రుణమాఫీ వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్తు వంటి అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో పేద ప్రజల గృహావసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకం ఎంతోమందికి ఊరటనిస్తుందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రతా చిహ్నమన్నారు.సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ రోజు చిరస్మరణీయం రోజని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో న్యాయం, సమానత్వం పాటించామని కమిటీ సభ్యులతో కలిసి కృషి చేశామని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇండ్ల నిర్మాణం జరిగే వరకు సహాయ సహకారాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ,మేధ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పోరేటర్లు బోమ్మక్ కళ్యాణ్ కుమార్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,భూక్య సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్,ఎ.రాములు,దయ్యాల అలివేలు,ఉప్పుగళ్ళ ప్రశాంత్,రాహుల్,వార్డు అధికారులు,లబ్దిదారులు పాల్గొన్నారు.

కష్టకాలంలో కలిసొచ్చిన సీఎంఆర్ఎఫ్

షఫీకి సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ2.40 లక్షల సాయం.

ప్రజల పట్ల బాధ్యతగా మరోసారి ప్రేమ చాటుకున్న వజ్రేష్ యాదవ్.

వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 28 బోడుప్పల్ : బోడుప్పల్ అశోక్ నగర్‌కు చెందిన మొహమ్మద్ షఫీ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ, ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న మేధ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2,40,000 మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన పత్రాల సమీకరణ నుంచి, ఫైల్ ప్రాసెసింగ్ వరకూ మొత్తం ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కును షఫీ తండ్రి మొహమ్మద్ మొయినుద్దీన్ కు అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ,కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి, ఏ పార్టీ, ఏ మతం, ఏ వర్గం అనే తేడా లేకుండా సహాయం అందేలా పనిచేయడం తమ బాధ్యత అని తెలిపారు. షఫీ కుటుంబ సభ్యులు వజ్రేష్ యాదవ్ కి కృతజ్ఞతలు తెలుపుతూ,సంక్షోభ సమయంలో ఈ సహాయం తమకు పెద్ద సహాయకరంగా ఉందని, త్వరలో షఫీ పూర్తిగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబెర్ ముజీబ్, మజార్, యాకూబ్, ఖాదర్,ఉస్మాన్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

కపిల్ చిట్ ఫండ్‌లో అద్భుతమైన ప్రమాద బీమా పాలసీ

బాధితునికి ప్రమాదభీమా చెక్కు అందజేత

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 28 : కపిల్ చిట్ ఫండ్ లో సభ్యునిగా చేరి మధ్యలో చిట్టి పాడుకొని ప్రమాద బీమాలో చేరిన సభ్యుడు ప్రమాదశాత్తు అంగవైకల్యం లేదా మరణం సంభవించిన సభ్యుని కుటుంబాలకు ప్రమాద బీమా పాలసీను కపిల్ చిట్ ఫండ్ అనుబంధ సంస్థ అయినా కపిల్ హెల్త్ క్లబ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా బెనిఫిట్స్ అందచేస్తున్న మని కపిల్ హెల్త్ క్లబ్ ఉప్పల్ ఏరియా మేనేజర్ నరసింహారావు తెలిపారు.గురువారం కపిల్ చిట్ ఫండ్ ఉప్పల్ శాఖలో 10లక్షల చిట్ లో చేరి, మధ్యలో చిట్టి ఎత్తుకొని, రూ.5400 తో ప్రమాదబీమా పాలసీ చేయించుకున్న శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చేయి కోల్పోవడంతో బాధితుడు శ్రీధర్ రెడ్డికి 6'89'793/-(రూ.ఆరు లక్షల ఎనభై తొమ్మిది వేల రూపాయల చెక్ ను కపిల్ చిట్ ఫండ్ హైదరాబాద్ క్లస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ డి.నారాయణ రెడ్డి చేతులమీదుగా అందచేశారు.కపిల్ చిట్ ఫండ్స్ లో చిట్స్ సభ్యునిగా చేరిన లో జాయిన్ అయినా ప్రతి ఒక్కరూ చిట్టిని మధ్యలో ఎత్తుకునే సమయంలో ప్రమాద బీమా పాలసీ చెల్లిస్తే ప్రమాదవశాత్తు సభ్యునికి ప్రమాదం సంభవించి అంగవైకల్యం, లేదా మరణం సంభవించిన, ప్రమాద బీమా అందుతుందని కపిల్ హెల్త్ క్లబ్ ఉప్పల్ ఏరియా మేనేజర్ నరసింహ రావు పేర్కొన్నారు.చిట్టిని మధ్యలో ఎత్తుకునే సమయంలో కేవలం 5400రూపాయలు చెల్లించి ప్రమాద బీమా పాలసీలో చేరితే చిట్ అయిపోయే వరకు బీమా పాలసీ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కపిల్ చిట్ ఫండ్ ఉప్పల్ రీజనల్ మేనేజర్ నరసింహ గౌడ్, ఉప్పల్ శాఖ బ్రాంచ్ మేనేజర్ శ్రవణ్ కుమార్, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

– డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ

జమ్మికుంట నవంబర్ 28 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నవంబర్ 21 నుండి డిసెంబర్ 4వ తేదీ వరకు నాన్‌స్కాల్పెల్ వేసెక్టమీ (NSV) పక్షోత్సవాలను నిర్వహిస్తుంది,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో శుక్రవారం రోజు నుండి డిసెంబర్ 4వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాన్‌స్కాల్పెల్ వేసెక్టమీ (NSV) కుటుంబ నియంత్రణ శిబిరాలను నిర్వహిస్తుంది అని, దీంట్లో భాగంగా జమ్మికుంటలో నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ శిబిరాన్ని డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ హుజురాబాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేసుకోవడానికి వచ్చిన వ్యక్తులకు కోత కుట్టు లేని నాన్‌స్కాల్పెల్ వేసెక్టమీ (NSV) ఆపరేషన్‌పై అవగాహన కల్పించడంతోపాటు ఆపరేషన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి క్లుప్తంగా వివరించారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడంలో పురుషులు ముందుండాలని సూచించారు. అర్హులైన పురుషులు నవంబర్ 29 వ తేదీ డిసెంబర్ 1వ తేదీ రోజులలో జమ్మికుంట ప్రభుత్వ సివిల్ హాస్పిటల్,డిసెంబర్ 2 మరియు 4 తేదీలలో హుజరాబాద్ ఏరియా హాస్పిటల్ లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకోగలరని ఇటువంటి కుటుంబ నియంత్రణ శిబిరాలను అర్హులైన పురుషులు సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సూపరిండెంట్ సివిల్ హాస్పిటల్, మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్,సూపర్వైజర్ సదానందం,హెల్త్ అసిస్టెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ సీఐ పరిశీలన

గ్రామాల్లో ఎన్నికల అవగాహన కార్యక్రమం

చిగురుమామిడి (వాయిస్ టుడే) : చిగురుమామిడి మండలంలోని పీచుపల్లి, చిన్న ముల్కనూరు గ్రామాల పోలింగ్ కేంద్రాలను తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ శుక్రవారం సందర్శించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, భద్రతా పరిస్థితులను ఆయన సమీక్షించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కన్డక్ట్) నిబంధనలను వివరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలు, ప్రలోభాలు, బెదిరింపులు జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని సీఐ స్పష్టం చేశారు. ఓటర్లు స్వేచ్ఛగా, భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని భద్రతా చర్యలను పోలీసులు చేపట్టినట్లు తెలిపారు. స్వచ్ఛమైన, శాంతియుత ఎన్నికల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామస్తులను సీఐ కోరారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు ఎవ్వరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి సబ్ ఇన్ స్పెక్టర్ సాయి కృష్ణ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్యోతిరావ్ బా పూలే జీవితం అందరికీ ఆదర్శం : వొడితల ప్రణవ్

- విద్య సమాన హక్కు అని నినదించిన వ్యక్తి.
- ఆయన ఆశయాలు అందరికి స్ఫూర్తిదాయకం.
- హుజురాబాద్ లోనీ ఒక సర్కిల్ కు పూలే పేరు.
- 1కోటి.50లక్షలతో హుజురాబాద్ పట్టణంలోని 4 జంక్షన్ ల అభివృద్ధికి కృషి.

హుజురాబాద్ నవంబర్ 28 (వాయిస్ టుడే): సమాజంలో అణగారినవర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మా జ్యోతిరావుబా పూలే అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం 136వ వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సివిల్ హాస్పిటల్ ముందు గల ప్రధాన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని,ఆది అందరి హక్కు అని,అక్షరాస్యత అందరికి అందాలని కొట్లాడారని,ఆయన స్ఫూర్తితో హుజురాబాద్ నియోజకవర్గంలోనీ ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. ఇటీవల విడుదల అయిన 15కోట్ల అభివృద్ధి నిధుల్లో భాగంగా హుజురాబాద్ పట్టణంలో కోటి ముప్పై లక్షలతో 4 ప్రధాన చౌరస్తాలను అభివృద్ధి చేస్తున్నామని దాంట్లో ఒకదానికి జ్యోతి బా పూలే పేరు పెడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో పూలే అభిమానులు,పలు సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు శాంక్షన్

- లారీ సంఘం తరఫున శుభాకాంక్షలతో పాలాభిషేకం

రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా, రామగుండం ఏరియా లైన్ లారీ యజమానుల సంక్షేమ సంఘ సభ్యులు ప్రాంతీయ శాసనసభ్యులు మరియు సంఘ గౌరవాధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కుందూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... "పవర్ ప్లాంట్ స్థాపనతో రామగుండం మరియు పరిసర ప్రాంతాలలో స్థానిక యువతకు, కార్మికులకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని, ప్లాంట్ నుండి ఉత్పత్తి అయ్యే జిప్సం, బైప్రొడక్ట్స్ వలన లారీ యజమానులకు లోడింగ్ అవకాశాలు పెరిగి రవాణా వ్యాపారానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే, ఈ ప్రాజెక్ట్‌ను రామగుండానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించినందుకు సీఎం శ్రీ రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి,మంత్రి దుద్దిలో శ్రీధర్ బాబు కి,ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ కి సంఘం తరఫున శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు." ఇక, ప్రతిపక్షం చేస్తున్న కొన్ని అనవసర అభ్యంతరాలను ఆయన స్పందిస్తూ .... "పవర్ ప్లాంట్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయడమే" అని పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో సింగరేణి, NTPC ప్రాజెక్టులకు చెందిన నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించడం వలన రామగుండం, గొదావరిఖనీ ప్రాంతాలు నష్టపోయాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ రోడ్లు, ప్రార్థనా మందిరాలు, దేవాలయాలు, మార్కెట్ ఏరియా, షాపింగ్ జోన్లు వంటి ప్రజా అవసరాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఆయన అభినందించారు. లారీ అసోసియేషన్ తరఫునప్రాంత అభివృద్ధి,పారదర్శక పాలన,స్థానిక యువతకు ఉపాధి సృష్టి కోసం తీసుకుంటున్న ప్రతి అడుగులో కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖాజా మొయినుద్దీన్, సుభాని, ప్రభాకర్ రెడ్డి, రాజేశం, సలీం పాషా, రాజిరెడ్డి, ముస్తఫా, శ్రీనివాస్, అక్బర్, రాజయ్య ,తరుణ్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, రవి, తదితరులు లారీ యజమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణికి డెలివరీ అయ్యే వరకు పోషకాహారం అందిస్తాము!

ఉష సాయి ప్రకాష్ దంపతులు..

పెద్దపెల్లి జిల్లా: నవంబర్. 28 (వాయిస్ టుడే) గోదావరిఖని: నీడ కొత్తగా దత్తత తీసుకున్న 13వ నిరుపేద గర్భిణీ స్త్రీ శ్రీమతి నవ్య కి పోషకాహార%శ%, పండ్లు, బియ్యం అందించిన సాహితి హాట్ చిప్స్ నిర్వాహకులు ఉష సాయి ప్రకాష్ దంపతులు. సంజయ్ గాంధీ నగర్ కి చెందిన నవ్య నిరుపేద గర్భిణీ స్త్రీ. భర్త కూలి పని చేస్తాడు. కిరాయి ఇంట్లో ఉంటున్నారు. 4 వ నెల గర్భిణీ స్త్రీకి అంగన్వాడి నుంచి పోషకాహారం అందుతున్నప్పటికీ ఆరోగ్యవంతమైన పాపకు జన్మనివ్వలన్న సరైన పోషకాహారం ఇంట్లో కూడా అందాలి. నవ్య పేదరికం కారణంగా సరైన పోషకారం తీసుకోలేని పరిస్థితుల్లో ఉందని అంగన్వాడి టీచర్ మమత ద్వారా విషయం తెలుసుకున్న నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పల్లెర్ల రమేష్ గౌడ్ స్థానిక మార్కండేయ కాలనీ చెందిన సాహితి హాట్ చిప్స్ నిర్వాహకులు ఎలిగేటి సాయి ప్రకాష్ ఉషా దంపతులు వారి షాప్ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవ్య డెలివరీ అయ్యేవరకు ప్రతి నెల పోషకాహారం అందిస్తామని తెలిపారు. ఈరోజు నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉష సాయి ప్రకాష్ దంపతులు స్వయంగా విచ్చేసి నవ్వకు పోషకాహారం,పండ్లు, 5%ఎస్త్రం% బియ్యం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ మాట్లాడుతూ నీడ స్వచ్ఛంద సంస్థ తరఫున ఇప్పటివరకు 12 మందికి సహాయం చేశామని ఇప్పుడు 13వ గర్భిణీ స్త్రీని దత్తత తీసుకున్నామని వీరికి డెలివరీ అయ్యే వరకు ప్రతినెల పోషకాహార%శ% అందిస్తామని ఉష సాయి ప్రకాష్ దంపతులు తెలిపారు. ఇంకా ఇలాంటి నిరుపేద గర్భిణీ స్త్రీలు ఎక్కడ ఉన్న సహాయం చేస్తామని అలాగే దాతలు కూడా నీడ చేస్తున్న కార్యక్రమలకి కి మద్దతుగా నిలవలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇంకా ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్, దాతలు సాయి ప్రకాష్,ఉష, గార్లు సభ్యులు పీక శివకుమార్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28బీ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం మొదటి విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో నిర్వహించారు.కార్యక్రమంలో నోడల్ అధికారులు డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీఓ షరీఫుద్దిన్, ఏవో రాంరెడ్డి, ఈడీఎం శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలి

ప్లాస్టిక్ ను వినియోగించ వద్దు

సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28: రాజన్న సిరిసిల్ల జిల్లా లోని విద్యార్థులు పాఠ్యాంశాల పై ప్రయోగాలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్ర వాల్ పిలుపు ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వికా సిత్, ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా పాఠశాలల విద్యార్థుల జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాజ్య స్థరీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్ఎస్ బీవీపీ) శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ను పరిశీలించి, ఎలా తయారు చేశారు? వాటి వినియోగం, వచ్చే ఫలితాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని సూచించారు. ప్రయోగాలతోనే ఆ పాఠ్యాంశంపై మంచి అవగాహన వస్తుందని, అది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ప్రయోగాలు చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సౌర విద్యుత్, పవన విద్యుత్, ధర్మో డైనమిక్స్, కిరణజన్య సంయోగ క్రియ తదితర అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. సైన్స్ మ్యూజియం కోసం కావలసిన స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని, వివిధ సైన్స్ పరికరాలపై విద్యార్థులకు అవగాహన వచ్చేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బీసీలు అందరు కలిసి ఓడించాలి

పెద్దపల్లి జిల్లా నవంబర్. 28 (వాయిస్ టుడే) గోదావరిఖని : బీ.సీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీ.సీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానాలతోనూ బిసీ రిజర్వేషన్ సాధ్యం కాదని రెవంత్ సర్కార్ కు తెలసని ప్రాజ్ఞాంగ సవరణ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతది అనేది వాస్తవం ఇది అక్షర సత్యం అన్నారు. బిజెపికి కాంగ్రెస్ పార్టీ రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చేప్పాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పనిచేయాలని మోసపూరిత కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు ప్రజలంతా బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయిందని ఆరోపించారు. ఉన్న 27 గ్రామపంచాయిలకు %దీ=ా% పార్టీ నుండి ప్రతి గ్రామానికి ఇంచార్జీలను, కో ఆర్డినేటర్ లను ప్రకటించుకోవడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి తెలియపరుస్తూ, వారి ఆశయాల కృషికి పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ గోపు అయిలయ్య యాదవ్ బోడ్డు రవీందర్ కుమ్మరి శ్రీనివాస్ కల్వచర్ల కృష్ణ వేణీ గాధం విజయ బాదె అంజలి పర్లపల్లి రవి నారాయణదాసు మారుతి మేడి సదానందం కాల్వ శ్రీనివాస్ మేతుకు దేవరాజ్ నూతి తిరుపతి బుర్ర శంకర్ పిల్లి రమేష్ సట్టు శ్రీనివాస్ బస్వరాజ్ గంగరాజు తోకల రమేష్ గుర్రం పద్మ ఇరుగురాళ్ల శ్రావన్ కోడి రామకృష్ణ కీరన్ జీ చింటూ ఆవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల వేల బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన కాంగ్రెస్ నాయకులు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కౌశిక్ రెడ్డి

హుజురాబాద్ నవంబర్ 28 (వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం కన్నూరు గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 20 మంది బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తో పాటు పలువురు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు కనీసం ఏరియా బస్సు కూడా అందించలేని ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు విసుకు చెంది ఉన్నారని రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలుస్తారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు అన్ని బిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని, గెలిపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని భావించి పార్టీ మారామని అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గం తో పాటు రాష్ట్రంలో ప్రజల రైతుల మన్ననలను పొందుతున్నారని, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీయడంతో నియోజకవర్గ అభివృద్ధి కౌశిక్ రెడ్డి తోనే సాధ్యమని నమ్మి పార్టీ కండువా కప్పుకున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంపత్ రావు సత్యనారాయణ రావు మాజీ ఎం పి టి సి భాస్కర్ రావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరిష్ రావు సవాల్‌కు సిఎం లేదా స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

హరీష్ రావు మాటాలను వక్రికరిస్తే సహించం

స్థాయుని మించి మాట్లాడితే తగిన శాస్తి చెప్పకతప్పదు

రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్.

గోదావరిఖని: మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి లేదా స్థానిక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ సమాదానం చేప్పాలి కానీ స్థాయుని మించి మాజీ మంత్రి హరిష్ రావు పై పరుష పదజాలంతో తమ స్థాయుని మించి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడి, హరిష్ రావు దిష్టి బోమ్మను దహనం చేయాడాన్ని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ ఖండించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హరిష్ రావు ని దూషించి దిషబోమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై గోదావరిఖని 1 టౌన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామగుండానికి 800 మెగావాట్ల ధర్మల్ విద్యుత్ ప్లాంట్ కు 10 వేల 880 కోట్ల రూపాయలతో క్యాబినెట్ లో అమ్మెదం లభించడం విదితమేనని, ఎన్టీపీసీ 7 రూపాయలు ఒక యూనిట్ చోప్పున ప్లాంట్ నిర్మిసామంటే బయట మాకు 5 రూపాయలకే దోరుకుతుందని ప్లాంట్ నిర్మాణానికి 6 ఎళ్ల సమయం పడుతుందని అసెంబ్లీ లో సిఎం రెవంత్ రెడ్డి మాట్లాడటం జరిగిందని అన్నారు. ఈ 10 వేల 880 కోట్ల రూపాయలు తో ప్లాంటు నిర్మాణం అంటే ఒక్క యూనిట్ 8 రూపాయలు పడే అవకాశం ఉందని ఈ విషయం పై మాట్లాడినా మాజీ మంత్రి హరిష్ రావు దిష్టి బోమ్మను స్థానిక కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం సరైంది కాదన్నారు. హరిష్ రావు దిష్టి బోమ్మ దహనం చేసిన వారిపై కేసు నమ్మెదు చేసి తగినచర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్ పాముకుంట్ల భాస్కర్ కల్వచర్ల కృష్ణ వేణీ బాదే అంజలి గాధం విజయ నాయకులు అచ్చె వేణు మేతుకు దేవరాజ్ నూతి తిరుపతి బోడ్డుపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి జక్కుల తిరుపతి మేడి సదానందం ముద్దసాని సంధ్యా రెడ్డి తోకల రమేష్ సట్టు శ్రీనివాస్ బుర్ర శంకర్ బుర్రి వెంకటేష్ నీరటీ శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ చింటూ బాలరాజు పద్మ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో బిజెపి సర్పంచులను ఏకగ్రీవం చేస్తే గ్రామ అభివృద్ధికి పది లక్షలు

మాజీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్ రెడ్డి

వాయిస్ టుడే ప్రతినిధి నవంబర్ 29 హుస్నాబాద్ ప్రతినిధిబీ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మండల బిజెపి గ్రామీణ అధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో బిజెపి ఎన్నికల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు గంగిడి మోహన్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామగోపాల్ రెడ్డి హుస్నాబాద్ ఎన్నికల ఇన్చార్జి లక్కిరెడ్డి తిరుమల ముఖ్య అతిథిగహాజరయ్యారు.ఈ సందర్భంగా బిజెపి మాజి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రెండు సంవత్సరాలనుండి నుండి గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి మూడు వేలకోట్ల నిధుల సమయం అయిపోతుందని ఉద్దేశముతో ఆట్టి నిధులను రాబట్టడానికి మాత్రమే గ్రామపంచాయతీ ఎన్నికలు ఆగమేఘాలమీద నిర్వహిస్తున్నారని ఆరోపించారు.తెలంగాణలోని గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి పారిశుధ్యం కుంటుబడిందని ఏనాడు రాష్ట్రప్రభుత్వం గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కేంద్ర బండి సంజయ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంచే నిధులు సిద్దిపేట హుస్నాబాద్ హైవే రోడ్డు మరియు గ్రామీణ ప్రాంతాలలో డబల్ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. బిజెపి కేంద్రంలో ఏర్పాటయిన నాటి నుండి ఉచితంగా పేద ప్రజలకు బియ్యం అందిస్తుందని, అందులో కేజీకి 35 రూపాయలకు గాను 33 రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేవలం రెండు రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు గ్రామాలలోవైకుంఠధామాలు నిర్మించిందని తెలిపారు. నియోజకవర్గంలో బిజెపి పార్టీ అభ్యర్థులను ప్రతి గ్రామంలో ప్రతి తండాలో ప్రతి గ్రామపంచాయతీలో బరిలో నిలుస్తారని ఏకగ్రీవంగా బిజెపి అభ్యర్థులను ఎన్నుకున్నట్లయితే అట్టి గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరి చేయిస్తారని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామాలలో బిజెపి సర్పంచ్ అభ్యర్థులను ప్రజలను కోరారు. ఈ సమావేశంలో ఓ బి సి జిల్లా అధ్యక్షుడు బొమ్మ గాని సతీష్ బిజెపి నాయకులు వెల్దండి రాజేంద్రప్రసాద్ పూదరి కిష్టయ్య బైరి అరుణ్ శ్రీనివాస్ వెల్లి శ్రీనివాస్ ఇటికాల కుమారస్వామి కొలిపాక కిరణ్ పిట్టల సంతోష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాళ భైరవ స్వామి జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28బీ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ బీ కట్ట మైసమ్మ గుడి లోని ,శ్రీ కాళ భైరవ స్వామి, జన్మదిన వేడుకలు స్థానిక వ్యాపారస్తులు ఘనంగా నిర్వహించారు. ఒక పవిత్ర హిందూ ఆధ్యాత్మిక పండుగ. భక్తులు శ్రీ కాళ భైరవ స్వామి ఉగ్రరూపమైన శివుని ఆరాధన చేస్తారు. స్వామివారికి ఉదయమే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపారాధన, ఉపవాసం, భైరవ మంత్రం జపం చేశారు. సాయంత్రం అభిషేకాలు, దీపోత్సవాలు, నిర్వహించారు. స్థానిక వ్యాపారస్తులు, స్థానిక ప్రజలు, స్వామివారి పూజా నిర్వాహకులు దేవేందర్ రావు,వడ్నాల శేఖర్, దేవదాస్, కొంపెల్లి విజయ్, రామ రావు, సాయి, కూకట్ల బాబు, స్థానిక నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారిన మా నీటి సమస్య తీరడం లేదు

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పెద్దూర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గత ఐదు రోజుల నుండి మిషన్ భగీరథ మంచినీరు రావడం లేదు. గతంలో ఇదే రకంగా మంచినీటి సరఫరా ఉండడం తో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులకు, ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ వినతి పత్రాల ద్వారా తెలియ జేశాము. పట్టించుకునే నాధుడే లేడు. ప్రభుత్వాలు మారిన ఇప్పటి వరకు చిన్నపిల్లల కోసం అంగన్వాడి కేంద్రం లేదు. రేషన్ దుకాణం సదుపాయం లేదు. సరి అయిన బస్సు సౌకర్యం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత ఇరిగేషన్ శాఖ, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్పందించి వెంటనే మంచినీటి సరఫరా, అంగన్వాడి కేంద్రం, రేషన్ షాప్, ఇతర అన్ని సదుపాయాలు కల్పించాలి. లేనిచో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. బిజెపి సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, కొంపెల్లి విజయ్, అభినవ్, స్థానిక బిజెపి కార్యకర్తలు, స్థానిక మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి ఘన నివాళి

ప్రభుత్వం పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం లో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ కార్యాలయం వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి తెలిపారు. ఈ సందర్భంగా బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశం లోనే మొదటి సంఘ సంస్కర్తగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, స్త్రీలకు చదువును అందించడం కోసం పూలే తన భార్యనే మొదటి మహిళ ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారని, సమాజంలో ఉన్న అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి పూలే అని కొనియాడారు. సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి శూద్ర వర్గాలకు చదువులు అందించిన మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, వేములవాడ పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల స్ఫూర్తి అందించడం కోసం వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన వేములవాడ మండల అధ్యక్షుడు నేదూరి శ్రీకాంత్, మల్లారం హరీష్, నేదురి రాజు, కట్కూరి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిల భద్రతపై విద్యసంస్థలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28బీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ బృందం ప్రతి రోజు జిల్లా పరిధిలో ఉన్న విద్య సంస్థలు సందర్శిస్తు గుడ్ టచ్/బ్యాడ్ టచ్ / ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గంభిరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిపేట గ్రామంలో జడ్పీ ఎచ్ఎస్ పాఠశాలను శుక్రవారం రోజు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైన వెంటనే 87126 56425 షీ టీమ్ కి ఫిర్యాదు చేయాలని, ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, పిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏ. ఎస్.ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లెళ్ల చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28బీ గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ శుక్రవారం రోజు ఆకస్మిక తనిఖీ చేసి అలాగే వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించందంతో పాటు, వాహనాలను క్షుణ్ణముగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వెంట సి.ఐ మొగిలి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

ఎల్ ఓ సి మంజూరు చేపించిన బీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 28 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేశం అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 1,50,000 వేలు ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేపించారు.. కాగ ఎల్ ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిసి గురుకులంలో జ్యోతిబాపూలేకు ఘన నివాళి

నాగార్జునసాగర్ నవంబర్ 28 వాయిస్ టుడే ప్రతినిధి: బీసీ గురుకులంలో జ్యోతిబాపూలే వర్ధంతి పురస్కరించుకొని గురుకుల ప్రిన్సిపాల్ రవికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు జ్ఞాన జ్యోతిని అందించి చదువుల ప్రాముఖ్యతను తెలియజేసిన ఆధ్యుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. అలాగే విద్యార్థులు కూడా మంచి చదువు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకొని గొప్ప పేరును సంపాదించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ సంతోష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజ సేవ కోసం ఉద్యోగం వదిలి సర్పంచ్ పోటీలో తిరుపతి

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ మండలం దావన్ పల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు బానోత్ తిరుపతి తన గ్రామ ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ఊరి మీద ప్రేమతో గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేస్తున్నారు అందుకు నిబంధనల ప్రకారం ఉద్యోగం అడ్డు వస్తుందని తన ప్రభుత్వ ఉద్యోగం అయిన అనస్థీషియా టెక్నీషియన్ కు సైతం రాజీనామా చేసి సర్పంచ్ గా బరిలో పోటీలో ఉన్నారు ఆయన గతంలో కూడా గ్రామ అభివృద్ధి కోసం పోటీ చేసే ఆలోచనతో ఓ ఉద్యోగాన్ని వదులుకున్నట్లు ఆయన తెలిపారు. ఊరు మీద ఉన్న అభిమానంతో సేవ చేయాలని సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్ గా పోటీ చేయుటకు ముందుకు వచ్చినట్లు తిరుపతి తెలిపారు.

మహాత్మా జ్యోతి బాపులే 135వ వర్ధంతి సందర్భంగా ఘనమైన నివాళి

వాయిస్ టుడే ప్రతినిధి నవంబర్ 29 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో తేది :28.11.2025 శుక్రవారం రోజున హుస్నాబాద్ పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హుస్నాబాద్ నియోజకవర్గం %జోజ% ఆధ్వర్యంలో "మహాత్మా జ్యోతి బా పులే "135 వ వర్ధంతి కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి %జోజ% కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న సిద్దిపేట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూజ్యోతి బా పులే అట్టడుగు వర్గాలకు విద్య ను అందించడము, వితంతువుల, అనాధ పిల్లలను చేరదీసి విద్యా బుద్ధులను నేర్పించడం, బాలికలకు పాఠశాల లను నెలకొల్పారని అన్నారు.ఈ సమయంలో మహాత్మా జ్యోతి బా పులే ఆశయాలను ముందుకు తీసుకొని పోవాలని యువతకు పిలుపు నిచ్చారు. సింగిల్ విండో చైర్మన్ బోలి శెట్టి శివయ్య మాట్లాడుతూ సమాజం లో అత్యధిక జనాభా ఉన్న బీసీ లకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని, ఈ వర్గాల ప్రజలు ఉద్యమించడం ద్వారా మాత్రమే సాధించుకోవచ్చునని, ఆ వైపుగా పయనించాలని అన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్ మాట్లాడుతూ బీసీ లకు 42%రిజర్వేషన్స్ కాంగ్రెస్ పార్టీ ఇవ్వడానికి ముందున్నదని, కాని కేంద్రం సహకరించడం లేదని అన్నారు. కేంద్రం పై పోరు జరుపాలని అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, సిపిఐ నాయకులు కోహెడ కొమురయ్య, జేపీసీ నాయకులు నాంపల్లి సమ్మయ్య, కోడూరి శ్రీదేవి,కాంగ్రెస్ నాయకులు మైదాంశెట్టి వీరన్న,కోమటి సత్యనారాయణ, వడ్డేపల్లి వెంకటరమణ, బత్తుల రవి,వల్లపు రాజు,గట్టు రాములు,గురాల సంజీవరెడ్డి,ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు

బీసీ సంఘాల నాయకులు

నాగార్జునసాగర్ నవంబర్ 28 వాయిస్ టుడే ప్రతినిధి సామాజిక సమానత్వం,అణగారిన వర్గాల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని నాగార్జునసాగర్ బీసీ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ రమేష్ జీ అన్నారు,శుక్రవారం జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు నాగార్జునసాగర్ నందికొండ పట్టణం పైలాన్ కాలనీలో పట్టణ బీసీ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ రమేష్ జి ఆధ్వర్యంలో నిర్వహించారు ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు,పూలే ఆశయాలను ఆచరణాత్మక ఆలోచనలను గుర్తు చేసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ అంటరానితనంపై పోరాటం,విద్య ద్వారా సమాజ మార్పుకు పునాది వేసిన గొప్ప మహనీయుడు పూలే,కేవలం సామాజిక సంస్కర్త కాదు,అందరికీ సమాన అవకాశాలు ఉండాలి అనేదే పూలే సిద్ధాంతం అన్నారు,కుల వివక్షను రూపుమాపడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అని అన్నారు,ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆదాసు విక్రమ్,ముడావత్ లక్ష్మణ్ నాయక్, గడ్డమీది రవి,పోలోజు శ్రీనివాసచారి,గోపియా నాయక్,నవీన్,తదితరులు పాల్గొన్నారు.